ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 30.0
కనిష్ఠం : 24.0

కుంభవృష్టి





పెదవేగి మండలంలో రోడ్డు పైనుంచి పొంగిపొర్లుతున్న న్యాయంపల్లి పెద్దచెరువు

- పల్లపు ప్రాంతాలు జలమయం
- పొంగిన చెరువులు..
- ముసునూరులో 135.4 మి.మీ వర్షపాతం నమోదు
- ఉధృతంగా తమ్మిలేరు.. అధికారులు అప్రమత్తం
- ఏలూరుకు వరద ముప్పు..



ఏలూరుసిటీ/పోలవరం/పెదవేగి/ముసునూరు/ చాట్రాయి/ఏలూరురూరల్/ చింతలపూడి/ఆగిరిపల్లి/ నూజివీడు/ ఉంగుటూరు/ భీమడోలు/నూజివీడు టౌన్/కలిదిండి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో జిల్లాలో బుధవారం వినాయక చవితి పండుగ రోజున మధ్యాహ్నం వరకు నానుడు వర్షాలు కురిసినా గురువారం తెల్లవారు జామున మూడు గంటల నుంచి కుండపోతగా వర్షాలు కురిశాయి. జిల్లాలో జనజీవనం స్థంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు ముంపునకు గురయ్యాయి. ముసునూరు మండలంలో రహదారులపై నీరు ఉధృతిగా ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.

పోలవరం మండలంలో ఏకధాటిన వర్షం కురవడంతో ప్రజా జీవనం స్తంభించింది. కొత్త రామయ్యపేట పునరావాస కాలనీలో రోడ్డుపై చెట్టు కూలి రాకపోకలకు అంతరాయం కలిగింది. కొండవాగుల జలాలు పొంగి ప్రవహిస్తున్నాయి. పెదవేగి మండలంలో పంటపొలాలు, రహదారులపై నీరు పారుతోంది. తహసీల్దారు డి.భ్రమరాంబ ఆయా గ్రామాల్లో పర్యటించారు. కూరగాయల పాదులకు నష్టం ఏర్పడిందని ఏవో శ్రీనివాస్ చెప్పారు. పెదవేగి- కూచింపూడి మధ్య న్యాయంపల్లి పెద చెరువుకు వరదనీరు పోటెత్తడంతో అలుగు పొంగి ప్రధాన రహదారి పైనుంచి ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. ఆయా గ్రామాల్లో అరటి, నిమ్మ, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో వర్షపునీరు చేరింది. వర్షాలకు జగన్నాథపురం దళితవాడలో మోర్ల గంగాజలం, దోమతోటి నాగమణిలకు చెందిన ఇళ్లు నీటమునిగాయి. ముసునూరు మండలంలో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వలసపల్లి ప్రధాన రహదారిలో సంధ్య వాగు, నూజివీడు రహదారిలో రాములేరు, అక్కిరెడ్డిగూడెం రహదారిలో ఉన్న కట్టుకాలువ, రమణక్కపేట రహదారిపై మొండివాగు ఉధృతంగా ప్రహించడంతో గంటల తరబడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చింతలవల్లి ఎంపీపీ పాఠశాల నీట మునగగా తరగతి గదుల్లోకి సైతం నీరు చేరింది. పల్లపు ప్రాంతాల్లో నివాస గృహాలు నీటమునిగాయి. వరి, పత్తి పంటలపై వరదనీరు ప్రహించడంతో స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఆగిరిపల్లి మండలంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎగువన కురిసిన వర్షాలతో కంపిని వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆగిరిపల్లి, నూగుండపల్లి, గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వాగు ఉధృతిని తహసీల్దార్ ప్రసాద్, ఎస్‌ఐ శుభశేఖర్ పరిశీలించి వంతెనపై పోలీస్ గస్తీని ఏర్పాటు చేశారు. నూజివీడులో లోతట్టు ప్రాంతాలైన ఎన్టీఆర్ కాలనీ, ఎమ్మార్ అప్పారావుకాలనీ, ఎమ్టీ రోడ్డులోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద ప్రధాన రహదారి నీటమునిగాయి. మంత్రి ఆదేశంతో పురపాలక సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టారు. నూజివీడు పట్టణ పరిధిలోని హనుమాన్ జంక్షన్ రోడ్డులోని మొగళ్ళ చెరువు (మిగతా 8వ పేజీలో)



పెదవేగి మండలం జగన్నాథపురంలో నీట మునిగిన ఇళ్ల ఎదుట బాధితులు

వర్షపాతం వివరాలు..

గత 24 గంటలలో జిల్లాలోనే అత్యధికంగా ముసునూరు మండలంలో 135.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 48.7 మి.మీగా నమోదైంది. కామవరపుకోట 100.2, పోలవరం 82, భీమడోలు 79.8, లింగపాలెం 73.4, ఏలూరు అర్బన్ 68.4, ద్వారకాతిరుమల 62.2, పెదవేగి 61.4, దెందులూరు 59.8, ఉంగుటూరు 58.4, ఏలూరు రూరల్ 51, చాట్రాయి 49.2, ముదినేపల్లి 48.8, చింతలపూడి 48.2, కుక్కునూరు 47.2, మండవల్లి 43.6, వేలేరుపాడు 39.8, ఆగిరిపల్లి 36.8, కైకలూరు 36.8, నిడమర్రు 28.4, కొయ్యలగూడెం 26.4, నూజివీడు 25.6, టి.నరసాపురం 25.2, పెదపాడు 24.6, జంగారెడ్డిగూడెం 23, జీలుగుమిల్లి 17.4, బుట్టాయిగూడెం 6.6, కలిదిండి 3.4 మి.మీ వర్షపాతం నమోదైంది.



ఉధృతంగా తమ్మిలేరు

అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తమ్మిలేరు ప్రాజెక్టుకు భారీగా వరద వస్తోంది. గురువారం సాయంత్రం 4.30 వరకు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 1200 క్యూసెకులు ఉండగా తర్వాత వరద ఉధృతి పెరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి చిన్నంపేట తమ్మిలేరు కాజ్‌వే వద్ద ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. వరద ఉధృతి కారణంగా చాట్రాయి మండలం కోటపాడు, చింతలపూడి మండలం పోతునూరు. మండలంలోని చీపురుగూడెం, చింతలపూడి మండలం మల్లాయగూడెం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. విజయరాయి సమీపంలో తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సమీప గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 355 అడుగులు కాగా నీటి మట్టం 343 అడుగులకు చేరింది. తమ్మిలేరు 348 అడుగులు దాటితే దిగువకు నీరు విడుదల చేస్తారు. భారీ వర్షాలకు ముసునూరు మండల పరిధిలో తమ్మిలేరు ఉధృతంగా ప్రహిస్తోంది. గురువారం వరదనీటి ప్రవాహన్ని ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. గుళ్ళపూడి, లోపూడి, యల్లాపురం, బలివే, వేల్పుచర్ల గ్రామాల్లో తమ్మిలేరు వద్ద రెవెన్యూ, పంచాయితీ, పోలీస్ సిబ్బందితో బందోస్తు ఏర్పాటు చేశారు. చింతలపూడి మండలంలో శివపురం వంతెనను ఆనుకుని తమ్మిలేరు వరద ప్రవహిస్తోంది

ఏలూరు నగరానికి తమ్మిలేరు వరద ముప్పు పొంచి ఉంది. నాగిరెడ్డిగూడెం జలాశయం నుంచి ఏలూరు వరకు తమ్మిలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. నగరంలో తూర్పు, పశ్చిమ, తమ్మిలేరు పాయల్లో వరద నీరు ఉరకలెత్తడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఏలూరు శనివారపుపేట కాజ్‌వే కింద నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇది మరింత పెరిగి కాజ్‌వే పై నుంచి ప్రవహించే ప్రమాదం ఉండడంతో వాహన రాకపోకలను పోలీసులు నిలిపివేశారు.

మళ్లీ పెరుగుతున్న గోదావరి

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం : వారం తిరగకుండానే గోదావరి నదికి మరోసారి వరద పోటెత్తింది. అల్పపీడన ప్రభావంతో ఎగువన కురిసిన వర్షాలతో గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గురువారం ఉదయం 6 గంటలకు భద్రాచలం వద్ద 32 అడుగులు ఉన్న నీటిమట్టం మధ్యాహ్నం రెండు గంటల వరకు 37అడుగులకు పెరిగి కొంతనిలకడగా ఉండి సాయంత్రానికి 39 అడుగులకు చేరింది. అయితే తెలంగాణలోని కామారెడ్డి, నిర్మల్, ములుగు, వరంగల్ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గురువారం అర్ధరాత్రికి మొదటి హెచ్చరిక స్థాయి 43 అడుగలకు చేరుకోవచ్చని సీడబ్ల్యూసీ అధికారులు అంచనా వేస్తున్నారు.





వేలేరుపాడు మండలంలో ఎద్దువాగు వంతెన మునిగిపోవడంతోపాటు వేలేరుపాడు, రుద్రమ్మకోట మధ్య కాజ్‌వేపై వరదనీరు చేరుకోవడంతో మొత్తం 18గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు, దాచారం గ్రామాల మధ్య ఉన్న గుండేటివాగు లోలేవెల్‌కాజ్‌వే మరలా నీటమునగడంతో ప్రజలు వయా నల్లకుంట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. పట్టిసీమ శివక్షేత్రం చుట్టూ వరద జలాలు ఆక్రమించాయి. కడెమ్మ స్లూయిజ్ వద్ద వరద జలాలు పెరగడంతో గేట్లు కొంతమేర మూసూకుపోయి ఏటిగట్టు కుడివైపున ఉన్న కొండవాగుల జలాల నీటిమట్టం పెరుగుతూ వస్తోంది.



జై గణేశ్ మహారాజ్‌కీ..

జిల్లావ్యాప్తంగా గణేశ్ ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం వినాయక చవితి సందర్భంగా స్వామివారి ఆలయాలతో పాటు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిళ్ల వద్ద పూజలు నిర్వహించారు. ఏటా మాదిరిగానే పలు ప్రాంతాల్లో భారీ గణనాథులను ఏర్పాటు చేశారు. పైచిత్రంలో ఏలూరు రామకోటి ప్రాంగణంలో పూజలందుకుంటున్న భారీ గణనాథుడు.

ఎట్టకేలకు ఒక బార్‌కు నాలుగు దరఖాస్తులు

- నేటితో ముగియనున్న గడువు

ఏలూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):జిల్లాలో బార్‌లకు దరఖాస్తులు మందకొడిగా నమోదవుతు న్నాయి. జిల్లాలో 18 ఓపెన్ కేటగిరి బార్‌లకు గురువారం నాటికి మొత్తం దరఖాస్తుల సంఖ్య తొమ్మిదికి చేరింది. 26వ తేదీ నాటికి ఈ దరఖాస్తుల సంఖ్య ఆరే ఉంది. ఇదిలా ఉండగా గెజిట్ ప్రకారం ఏలూరులో 9 నంబర్ షాపు లైసెన్సుకు నాలుగు దరఖాస్తులు దాఖలు కావడంతో లాటరీ తీయడానికి అర్హత దక్కించుకుంది. బార్‌లకు పెంచిన దరఖాస్తు గడువు శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ముగియనుంది. మరోవైపు కల్లుగీత కార్మిక వర్గాలకు కేటాయించిన ఏలూరు, జంగారెడ్డిగూడెం బార్‌లకు ఒక్కొక్క దరఖాస్తు దాఖలైంది. వీటికి కూడా గడువు ఈ నెల 29వ తేదీతో ముగియనుంది. ఒక్కొక్క బార్‌కు నాలుగేసి దరఖాస్తులు వస్తేనే ఈ నెల 30న ఉదయం 8 గంటలకు ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో కలెక్టర్ వెట్రిసెల్వి లాటరీ తీసి లైసెన్సులను కేటాయించనున్నారు.

డ్వాక్రా సంఘాలను బలోపేతం చేయాలి : కలెక్టర్

ఏలూరుసిటీ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):జిల్లాలో డ్వాక్రా సంఘాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడం ద్వారా మహిళల సాధికారితకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వార్షిక రుణప్రణాళిక, డ్వాక్రా సంఘాల జీవనోపాదుల కార్యక్రమంపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో 39,396 సంఘాలు రూ.1,688 కోట్లతో సూక్ష్మరుణ ప్రణాళికలు అందించారని, వారికి రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో మహిళా రైతులను ప్రోత్సహించాలన్నారు.



వేల్పుచర్లలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది

వేల్పుచర్లలో నాలుగు డెంగీ కేసులు

ముసునూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వేల్పుచర్లలో నాలుగు డెంగీ కేసులు వెలుగు చూశాయి. ఒకే ఇంటిలో జంగం దీక్షిత(9), జంగం గీతిక(7)లతోపాటు చల్లా అఖిల్, రామాల చందులు కొన్ని రోజులుగా జర్వంతో బాధ పడుతున్నారు. వీరికి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయగా డెంగీగా నిర్ధారణ అయినట్లు వైద్యాధికారిణి డాక్టర్ షకీనా ఇవాంజలి గురువారం తెలిపారు. ప్రస్తుతం బాధితులు ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారని, వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు. గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజలకు వైద్యపరీక్షలు చేస్తున్నారు. ఇంటింటి ఫీవర్ సర్వేను చేపట్టారు. జర్వం లక్షణాలు ఉన్నవాళ్ళను గుర్తించి చికిత్స అందిస్తున్నారు. గ్రామంలో పారుశుద్యం అధ్వానంగా ఉందని, మురుగునీరు నిల్వలతో దోమలు పెరిగిపోయి, అనారోగ్యానికి గురి అవుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారులు, పాలకులు, వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటి వరకు ఒక్కసారి కూడా దోమల నివారణ మందును పిచికారీ చేయలేదని వారు అధికారులు, పాలకుల పనితీరుపై అగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త సింగారం

ఏలూరు జిల్లా నలుదిక్కులా కొత్త సింగారాలు అలముకోనున్నాయి. ఆగిరిపల్లి శివార్ల మీదుగా అమరావతి అవుటర్ రింగురోడ్డు రాబోతోంది. ఏజెన్సీ ప్రాంతంలో డబుల్ బొనాంజా తలపెట్టేలా ఓ వైపు గ్రీన్‌ఫీల్డ్ హైవే ఇప్పటికే కొలిక్కివచ్చింది. సమాంతరంగా సత్తుపల్లి- కొవ్వూరు మీదుగా కొత్త రైల్వే లైనుకు ఈ మధ్యనే డీపీఆర్ కేంద్రా నికి చేరింది. మరోవైపు కొల్లేరు ప్రాంతాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దితే నలుమూలలా జిల్లాకు న్యూ లుక్ రాబోతుంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

- జిల్లా నలుదిక్కులా సరికొత్త ప్రణాళికలు
- ఆగిరిపల్లి సమీపాన అవుటర్ రింగురోడ్డు
- ఏజెన్సీలో గ్రీన్‌ఫీల్డ్ హైవే..రైల్వేమార్గం
- కొల్లేరు, పోలవరం వద్ద పర్యాటక లుక్

జిల్లాకు అన్ని హంగులు సమకూర్చేందుకు ఒక్కొక్కటిగా సిద్ధం అవుతున్నాయి. ఈ మధ్యనే అమరావతి అవుటర్ రింగురోడ్డుకు ప్రతిపాదనకు బీజం పడింది. ఈ ప్రాంతంలో భూసేకరణకు గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఒకప్పుడు తలపెట్టినా, ప్రచారంలో ప్రధాన పాత్ర పోషించినా రాజధాని మండలాల్లో ఆగిరిపల్లి ఒకటి. అప్పటి రాజధాని కల నెరవేరలేదు కానీ తాజాగా రాజధాని అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు ఆగిరిపల్లి మండలం మీదుగా సాగనుంది. సాధ్యమైనంత భూసేకరణ పూర్తి చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సీఆర్‌డీఏ పరిధిలో యావత్తు ప్రక్రియ కొనసాగబోతోంది. ఆగిరిపల్లి, బొద్దనపల్లి, జి.కండ్రిక, పిన్నమరెడ్డిపల్లి, నూగొండపల్లి, నర్శింగపాలెం, సగ్గూరు, కృష్ణవరం, సూరవరం గ్రామాల అంచులను ఈ మార్గం తాకబోతోంది. రియల్ ఎస్టేట్ రంగంలో కాస్తంత వెనుకబాటు తనాన్ని చవి చూస్తున్న ఈ ప్రాంతానికి అవుటర్ రింగురోడ్డు ఊపిరి పోసింది. ఇప్పటికే ప్రధాన మార్గాల్లో అటు,ఇటూ సెంటు రూ.25 లక్షల ధర పలుకుతోంది. ఇది కాస్త మరింత పెరిగే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. నివాస ప్రాం తాలకే డిమాండ్ పెరిగింది. మంత్రి పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడు నియోజకవర్గంలో త్వరలోనే కొత్తదనం రాబోతుంది.



ఏజెన్సీలో కొత్త వెలుగులు

జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతం ఇప్పుడు కొత్త కళ సంతరించుకుంటుంది. ఒకవైపు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మా ణం ఏకంగా తెలంగాణ హద్దుల నుంచి కొవ్వూరు వైపు సాగే ఈ రహదారి నిర్మాణం ఇప్పటికే కొలిక్కి వచ్చింది. తెలంగాణ- ఆంధ్రా ప్రాంతాలకు ప్రధాన వారధిగా మారబోతోంది. ఈ నిర్మాణం కారణంగా వైజాగ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు అతిపెద్ద వెసులుబాటు. ఎక్కడా వివాదం లేకుండా స్థానికులతో సంప్రదించి భూసేకరణ పూర్తి చేయడమే కాకుండా, ఆ వెనువెంటనే నిర్మాణానికి సిద్ధం అయ్యారు. ఎటుతిరిగి ఈ హైవే ఇరువైపులా సర్వీసు రోడ్లు లేకపోవడం అతిపెద్ద వివాద మైంది. ముందస్తుగా ఏ హైవే సాగినా ఇరువైపులా సర్వీసు రోడ్లను అభివృద్ధి చేస్తారు. కానీ ఇక్కడ సీన్ రివర్సు అయింది. ఇది తప్పితే గ్రీన్‌ఫీల్డ్ హైవే జీలుగుమిల్లి నుంచి జిల్లాకు కొత్త హంగులు సమకూర్చింది.

ఈ మధ్యనే ఇదే ప్రాంతంలో అందరూ కలలుగంటున్న సత్తుపల్లి- కొవ్వూరు రైల్వే మార్గానికి డీపీఆర్ సిద్ధమైంది. దాదాపు 2154 కోట్ల వ్యయంతో ఈ రైల్వే లైనుకు దాదాపు ఊపిరిపోయడం ఖాయమైంది. చాన్నాళ్ల నుంచి ఈ లైన్ కోసమే ఏజెన్సీ వాసులే కాకుండా మిగతా ప్రాంతాల వారు కళ్లలో వత్తులేసుకుని ఎదురుచూశారు. సాధ్యమైనంత మేర వచ్చే మూడేళ్లలోనే సుసాధ్యం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఒకవైపు గ్రీన్‌ఫీల్డ్‌వైపు, మరోవైపు కొత్త రైల్వే లైను డబుల్ బొనాంజాను తలపించేలా మారింది.



కొల్లేరు నుంచి పోలవరం వరకు..

జిల్లాలో ఇంకోవైపు పర్యాటకాన్ని తీర్చిదిద్దేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు సమీపాన ఐకాన్ బ్రిడ్జి నిర్మించాలని నిర్ణయించారు. పోలవరం ప్రాజెక్టును స్వయంగా వీక్షించడానికి ఈ ఐకాన్ బ్రిడ్జి ఉపయుక్తంగా ఉంటుంది. రాష్ట్ర పర్యాటకశాఖ దీనిని ప్రతిపాదించింది. పట్టిసీమ వద్ద పర్యాటక పార్కుకు మరో ప్రతిపాదన చేశారు. ఈ లోపే పనుల ఆరంభానికి వీలుగా అంతర్గత సన్నాహాలు ఆరంభం అయ్యాయి. పనిలో పనిగా చాన్నాళ్ల నుంచి కాగితాల మీదే ఉన్న కొల్లేరు టూరిజం మళ్లీ ప్రస్తావనకు వచ్చింది. స్థానికంగా ఉన్న వారికి ఉపాధి కల్పించడం ప్రధాన అంశం కాగా కొల్లేరును వీక్షించాలనుకున్న పక్షుల ప్రేమికులకు కొల్లేరు ఆలవాలం కాబోతోంది. ఇదంతా పూర్తి అయితే జిల్లాకు నలుదిక్కులా నయా లుక్ రాబోతుంది.

సక్రమమా?.. అక్రమమా ?

(నూజివీడు-ఆంధ్రజ్యోతి)

- శోభనాపురంలో భారీ ప్రైవేట్ గొడౌన్లు
- అనుమతులపై పెదవి విప్పని అధికారులు
- రేషన్ బియ్యం అక్రమ రవాణా కోసమే రూ.కోటితో రైస్‌మిల్లు?
- దృష్టి సారించిన సబ్ కలెక్టర్ వినూత్న
- అక్రమ అధికారుల్లో టెన్షన్

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు నూజివీడు కేంద్రంగా మారుతోంది. గతంలో పీడీఎస్ బియ్యం గ్రామాల్లోని మారుమూల ప్రాంతాల్లో పాడుపడిన ఇళ్లను అద్దెకు తీసుకుని రహస్యంగా రాత్రి వేళ నిల్వ చేయడం ఎగుమతి చేయడం లేదా బియ్యాన్ని రవ్వగా మార్చేవారు. ఇప్పుడు ఆ స్థితి నుంచి నియోజక వర్గంలోనే మామిడి తోటల్లో భారీగా పౌరసరఫరాల శాఖ గిడ్డంగుల్లాగా, బియ్యం అక్రమ రవాణా దారులు సొంత గొడౌన్‌లను నిర్మించుకోవడం విశేషం. గత గురువారం ఆగిరిపల్లి మండలం శోభనాపురం పరిధిలో మామిడితోట మధ్యలో భారీ స్థాయిలో నిర్మించిన గొడౌన్లపై పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖ అధికారులు దాడిచేసి నూతనంగా నిర్మించిన ఈ గొడౌన్‌లను చూసి నోరెళ్లబెట్టారు. రెండు గొడౌన్లు నిర్మితమై ఉన్నాయి. ఒక్కొక్క దానిలో వంద లారీల సరుకు పట్టేంత భారీస్థాయిలో ఉన్నాయి. చుట్టుపక్కల మండలాల నుంచి పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసిన అక్రమ బియ్యం వ్యాపారులు ఆ బియ్యాన్ని ఈ గొడౌన్లకు చేరుస్తారు. రెండు, మూడు లారీల లోడు రాగానే బియ్యాన్ని రాత్రి వేళ తరలిస్తారు. ఇలా ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీలోపు జరుగుతాయి. ఒక బ్యాచ్ ఈ గొడౌన్‌లను నిర్వహిస్తుండగా, చాట్రాయి మండలంలోని ఒక వ్యక్తితో, ఉమ్మడి కృష్ణా జిల్లాలో పీడీఎస్ డాన్‌గా ప్రసిద్ధి గాంచిన ఉయ్యూరు ప్రాంతానికి చెందిన ఒక అక్రమ బియ్యం వ్యాపారి కలిసి చాట్రాయికి సమీపంలోని విస్సన్నపేట-షైలవరం మధ్య కోటి రూపాయల వ్యయంతో రైస్ మిల్లును ఏర్పాటు చేసినట్టు సమాచారం. ఈ అక్రమ పీడీఎస్ బియ్యాన్ని కవరింగ్ చేయడానికే ఆ మిల్లును ఏర్పాటు చేసినట్టు సమాచారం. వీరు పోలవరం, చింతలపూడి నియోజక వర్గాల్లోని అనేక గ్రామాల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరిస్తారని తెలుస్తోంది. ఇటు నూజివీడు నియోజక వర్గంలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నట్టు సమాచారం. ఈ విధంగా (మిగతా 8వ పేజీలో)



శోభనాపురంలో ప్రైవేట్ గొడౌన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఆటాడదాం..



ఉమ్మడి జిల్లాలో మారుమూల పల్లెల నుంచి పట్టణాల వరకు క్రీడా కుసుమాలు గుబాళిస్తున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహం.. దాతల సహకారం.. కోచ్‌ల శిక్షణతో బాల బాలికలు, యువత క్రీడల్లో ప్రతిభ చూపుతున్నారు. జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా చూపడమే కాక ఒలింపిక్ క్రీడల్లో జిల్లా యువత పోటీ పడ్డారు. వచ్చే ఒలింపిక్ పోటీల్లో పతకమే లక్ష్యంగా సాధన చేస్తున్నారు. యువత పోటీల్లో రాణించడానికి కోచ్‌ల కఠోర శిక్షణ కూడా కారణం. క్రీడా మైదానమే లోకంగా క్రీడాకారులను తీర్చిదిద్దుతున్న గురువులు ఎందరో.. పాఠశాలల్లో పీఈటీ, పీడీలుగా మాత్రమే కాదు.. సెలవుల్లో సైతం క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి వందల మందితో వేల పతకాల పంట పండించారు. క్రీడా కోటాలో ఉద్యోగాలతో అనేక జీవితాలను నిలబెట్టారు. కొందరు ఉద్యోగాల్లో రాణిస్తూనే క్రీడల్లో ప్రతిభ చూపుతుంటే.. మరికొందరు ఉద్యోగాలను వదిలి క్రీడా శిక్షణకు పరిమితం కావడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో జడ్జిల స్థాయికి ఎదిగారు. ధ్యాన్‌చంద్ పేరుతో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహిస్తారు. మార్టేరుకు చెందిన అంతర్జాతీయ పరుగుల రాణి సత్తి గీత భారత ప్రభుత్వం నుంచి ధ్యాన్‌చంద్ అవార్డు అందుకుని జిల్లాకు గర్వకాణంగా నిలిచింది. నేడు జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా పలువురు క్రీడాకారులు, కోచ్‌ల మనోభావాలు వారి మాటల్లోనే..

నేడు జాతీయ క్రీడా దినోత్సవం

- ఉమ్మడి జిల్లాలో క్రీడా కుసుమాలు
- రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ
- ఏషియా, ఒలింపిక్ పోటీల్లో సత్తా
- క్రీడాకారులను తయారు చేస్తున్న కోచ్‌లు

మెరుపై సాగి.. గెలుపై నిలిచి..

ఏలూరు రూరల్, ఆగస్టు 28, (ఆంధ్రజ్యోతి): వారి ప్రతిభ అనంతం.. పోరు అద్వితీయం.. బరిలో దిగితే విజయం పాదాక్రాంతం. సవాళ్లు ఎదురైనా.. అసౌకర్యాలు వెనుక్కు లాగుతున్నా.. వెన్ను చూపరు. బరిలో చెలరేగిపోతారు. అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్, బాస్కెట్‌బాల్, డిస్కస్‌త్రో ఇలా ప్రతీ ఆటలో వారిదో ఘనత.. వారిదో చరిత్ర.. ఏలూరు జిల్లాలో క్రీడాకారులు వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచి జిల్లాకు గర్వకారణంగా నిలుస్తున్నారు.

పేదింటి బిడ్డ.. పోటీల్లో మెరిక అనిత



పేద కుటుంబానికి చెందిన ఎటాలీ అనిత డిగ్రీ పూర్తి చేసింది. ఆటలంటే బాగా ఇష్టం. పదేళ్లుగా బాస్కెట్‌బాల్ పోటీల్లో రాణిస్తోంది. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజయాలతో జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ప్రస్తుతం ఆమె పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తుంది. పాల్గొన్న ప్రతీ పోటీలో విజయఢంకా మోగిస్తున్నారు. బాస్కెట్‌బాల్‌లో ఆమె వ్యూహం శత్రు దుర్భేద్యం. బాల్ డిఫెన్స్ చేయడంలో అంది వేసిన చేయి. ఇటీవల అమరావతి స్పోర్ట్స్ మీట్‌లో జట్టు విజయంలో ఆమె కీలకంగా వ్యవహరించింది. ఓ వైపు చదువుకుంటూ మరోవైపు కోచ్ మురళీ కృష్ణ శిక్షణలో రాటుదేలుతోంది.

పరుగుల గుర్రం సాకిల్ బాబు



కె.సాకిల్‌బాబు మైదానంలో దిగితే పతకాల పంటే. రాష్ట్ర, జాతీయ స్థాయి పరుగు పోటీల్లో పతకాలు కొల్లగొట్టాడు. రాష్ట్ర, జాతీయ స్థాయి పరుగు పోటీల్లో పతకాలతో పాటు చదువుల్లోనూ రాణిస్తున్నాడు వంగాయగూడెంకు చెందిన సాహిల్. బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతూ జాతీయ స్థాయిలో పతకాలు అందుకుంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గుర్రాన్ని మించిన వేగంతో పరిగెడుతూ బంగారు పతకాలతో పాటు జాతీయ స్థాయి రికార్డులు నెలకొల్పాడు. ఇటీవల జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి బెస్ట్ అథ్లెట్‌గా ఎంపికయ్యాడు. కోచ్ ప్రసాద్ శిక్షణతో పతకాల వేట సాగిస్తున్నాడు. ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్స్ అండర్ - 18 బాలుర విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించాడు. ఏపీ స్టేట్ బెస్ట్ అథ్లెట్ అవార్డు అందుకున్నాడు.

హేమర్‌త్రో చిచ్చర పిడుగు షెర్లిన్



హేమర్‌త్రోలో ప్రతిభ కనబరుస్తూ పతకాలతో రాణిస్తోంది ఏలూరుకు చెందిన జి.తన్మయ షెర్లిన్. ఏలూరు సెయింట్ ఆన్స్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. హేమర్ త్రోలోనే కాక డిస్కత్రో, షాట్‌పుట్‌లో సైతం విశేషంగా రాణిస్తుంది. స్టేట్ అసోసియేషన్ మీట్‌లో రెండు సిల్వర్, రజత పతకం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హేమ్మర్‌త్రోలో రెండు వెండి, ఇంటర్ స్టేట్ డిస్కత్రో సిల్వర్, పల్నాడులో జరిగిన స్టేట్‌మీట్‌లో రన్నరప్‌గా నిలిచింది. కర్నూలులో జరిగిన స్టేట్ మీట్‌లో వెండి పతకం సాధించింది. జార్ఖండ్, రాంచి స్టేట్ నేషనల్స్‌లో విశేష ప్రతిభతో రన్నరప్‌గా నిలిచింది. హేమర్‌త్రో కోచ్ ఎస్ ఆదర్శ్ డిస్కత్రో షాట్‌పుట్‌లో భరత్‌రెడ్డి వద్ద శిక్షణ పొందుతొంది.

వెయిట్ లిఫ్టింగ్‌లో అరుణేష్‌బాబు సత్తా



జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పతకాలు కైవసం చేసుకుంటూ సత్తా చాటుతున్నాడు ఏలూరుకు చెందిన ఎంఎస్. అరుణేష్ బాబు. తన క్రీడాప్రస్థానంలో ఇటీవల మరో మైలు రాయి అధిగమించారు. ఇటీవల జరిగిన సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించాడు. నాగారంలోని ఎస్వీ ఆర్ఎం జూనియర్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఇటీవల జరిగిన రాష్ట్ర జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పతకాలు సాధించి తన సత్తా చాటాడు.

టెన్నీకాయిట్‌లో రాణిస్తున్న మౌనిక



లింగపాలెం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో పలువురు క్రీడాకారులు క్రీడలలో ప్రతిభను చాటుతున్నారు. పాఠశాల స్థాయి నుంచే క్రీడలలో రాణించి రాష్ట్ర జాతీయస్థాయిలో పతకాలను ఒడిసి పట్టారు. మండలంలోని కె.గోకవరం గ్రామానికి చెందిన కె.మౌనిక టెన్నీకాయిట్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో పలు పతకాలు సాధించింది. చిన్ననాటి నుంచే టెన్నీకాయిట్‌లో రాణిస్తూ రాష్ట్ర జాతీయస్థాయిలో 2 గోల్డ్, 2 సిల్వర్, 2 కాంస్య పతకాలను కైవసం చేసుకుని జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తెచ్చింది. చదువుకుంటూనే ఆసక్తి ఉన్న క్రీడలో రాణిస్తానని, పతకాలు సాధిస్తానని ఆత్మవిశ్వాసంతో చెబుతుంది మౌనిక.

ఉద్యోగ విరమణ చేసినా.. గ్రౌండ్‌లోనే గడుపుతా

చింతకాయల సత్యనారాయణ ఫిజికల్ డైరెక్టర్, తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పదేళ్ల కుర్రాడు క్రీడా మైదానంలో కనబడితే నాతో రన్నింగ్ చేయగలవా అంటూ ఆ మాస్టార్ చాలెంజ్ విసురుతాడు. ఆ కుర్రాడితో పరుగు పెట్టించి ఆటలపై ఆసక్తి పెంచుతారు.. ఆయనే ఫిజికల్ డైరెక్టర్ చింతకాయల సత్యనారాయణ. 37 ఏడేళ్లుగా తాడేపల్లిగూడెంలో క్రీడల మాస్టారుగా ఆయన అందరికీ సుపరిచితం. పాఠశాలకు సెలవులు వచ్చినా ఆయన ఎక్కువ సమయం గ్రౌండ్‌లోనే ఉంటారు... ఆటల్లో శిక్షణ ఇస్తారు. ఆయన వద్ద శిక్షణ పొందిన వందల మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు వెళ్లారు.. ఎన్నో పథకాలు సాధించారు. క్రీడా కోటాలో సుమారు 250 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఈ నెలలోనే ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన తర్వాత కూడా గ్రౌండ్‌లోనే సమయం గడుపుతానంటున్నారు.

కోడే వెంకట్రావు హైస్కూల్‌లో 1979లో పీఈటీగా ఉద్యోగంలో చేరి 37 ఏళ్ల సర్వీసులో ప్రస్తుతం పీడీగా పిల్లలకు క్రీడలు నేర్పుతూనే ఉన్నారు. పేద కుటుంబాల నుంచి వచ్చిన వారు క్రీడల ద్వారా ఉన్నత ఉద్యోగాలు సాధిస్తారని పిల్లలకు క్రీడలపై అవగాహన కల్పించి వారిని క్రీడల్లో మెరికల్లా తీర్చిదిద్దాదరు. వేసవి సెలవుల్లో కూడా బయట విద్యార్థులకు సైతం సమ్మర్ క్లాసుల పేరుతో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించారు. పతకాల పంట పండించారు.



ఖేలో ఇండియా జాతీయ క్రీడల్లో రిఫరీగా సత్యనారాయణ (ఫైల్, మధ్యలో)

ప్రభుత్వ ఉద్యోగాల్లో శిష్యులు

సత్యనారాయణ వద్ద శిక్షణ పొందిన చాలామంది క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో వేల సంఖ్యలో పతకాలు సాధించగా జాతీయ స్థాయిలో 300 పైగా పోటీల్లో పతకాలు సాధించారు. ఆయన దగ్గర శిక్షణ పొందిన వారు క్రీడా కోటాలో 250 మందికి పైగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. తన శిష్యులలో సీఐ, ఎస్సైలు, కానిస్టేబుల్స్, ఆర్మీ, నేవి ఉద్యోగులు ఉన్నారని, 27 మంది పీడీలుగా ఉద్యోగాలు నిర్వహిస్తున్నారని ఆయన ఆనందంగా చెబుతారు.

జాతీయ క్రీడలకు రిఫరీగా..

జాతీయ క్రీడలు, మిలటరీ, ఆసియా, ఖేలో ఇండియా క్రీడల్లో వరుసగా 12 ఏళ్లగా రిఫరీగా అవకాశం లభించింది. మునిసిపల్ హైస్కూల్ పీఈటీగా ఉద్యోగ జీవితం ప్రారంభించిన ఆయన జాతీయ స్థాయి క్రీడలకు రిఫరీగా వెళ్లడం జాతీయ అవార్డులు వచ్చినట్టు భావిస్తుంటారు.

ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత సత్తి గీత




రాష్ట్రపతి నుంచి ధ్యాన్‌చంద్ అవార్డు అందుకున్న సత్తి గీత (ఫైల్)

పెనుమంట్ర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ప్రతిష్టాత్మక అవార్డు ధ్యాన్‌చంద్ పురస్కారం అందుకున్న పరుగుల రాణి సత్తి గీత, అంతర్జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ క్రీడలో రాణించిన సుబ్బన్న ఇద్దరూ మార్టేరుకు చెందిన క్రీడాకారులు కావడం గమనార్హం. వారి మాటల్లోనే..

మా కుటుంబంలో తండ్రి సత్తి సత్తిరెడ్డి, తల్లి కమల ముగ్గురు అక్క చెల్లెళ్లు క్రీడా కారులే. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో క్రీడల్లో రాణించి పరుగు పోటీల్లో 500 పైగా బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించాను. అంతర్జాతీయ స్థాయిలో 30 పైగా పతకాలు కైవసం చేసుకున్నాను. కామన్వెల్త్ గేమ్స్‌లో సిల్వర్ మెడల్, ఏషియన్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్ సాధించడంతో రాష్ట్ర ప్రభుత్వం రాణి రుద్రమ దేవి తొలి అవార్డుతో సత్కరించారు. మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి ధ్యాన్‌చంద్ అవార్డును అందుకున్నాను. ప్రస్తుతం సౌత్ సెంట్రల్ రైల్వేలో స్పోర్ట్స్ ఆఫీసర్‌గా, నా భర్త జి.హర్షవర్ధన్ హాకీ క్రీడా జనరల్ సెక్రటరీగా పని చేస్తున్నారు క్రీడా అకాడమీ ఏర్పాటుచేసి క్రీడాకారులకు ఇవ్వడం మా లక్ష్యం.

- సత్తి గీత, సౌత్ సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ ఆఫీసర్

గురువు ప్రోత్సాహంతో క్రీడల్లో రాణించా



సత్తి సుబ్బన్న రెడ్డి

రాష్ట్ర ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడు పడాల ప్రహ్లాదరెడ్డి ప్రోత్సాహంతో తాను క్రీడల్లో రాణించా. నా ఆసక్తి గమనించిన ప్రహ్లాదరెడ్డి బాస్కెట్ బాల్ క్రీడలో శిక్షణ ఇచ్చారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో 10 బంగారు పతకాలు సాధించాను. తొలుత రైల్వేలో ఉద్యోగం చేశాను. ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీ నరసాపురం డిపో మేనేజర్‌గా పనిచేస్తున్నాను. కోచ్ పడాల ప్రహ్లాద రెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.25 లక్షల నిధిని ఏర్పాటుచేసి ఏటా టోర్నమెంట్ నిర్వహిస్తున్నా. తనలాగే రాణిస్తున్న క్రీడాకారులకు వసతి కల్పించాలానే ఉద్దేశ్యంతో ఖండవల్లి కిశోర్ ట్రస్ట్ ద్వారా భవనం నిర్మించి స్పోర్ట్స్ హాస్టల్ ఏర్పాటుచేశాను. క్రీడల్లో రాణిస్తున్న 8, 9, 10 తరగతుల విద్యార్థులకు హాస్టల్‌లో ప్రవేశం కల్పించి క్రీడల్లో శిక్షణ ఇస్తున్నా. ఉద్యోగ విరమణ తర్వాత కూడా తన జీవితం క్రీడలకు అంకితం చేయడమే నా లక్ష్యం.

- సత్తి సుబ్బన్న రెడ్డి, ఆర్టీసీ నరసాపురం డిపో మేనేజర్

కరాటేలో బ్లాక్ బెల్ట్ షైనీ



ఆకివీడు రూరల్ ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అజ్జమూరు గ్రామానికి చెందిన గంటా షైనీ చిన్న వయస్సులోనే కరాటేలో బ్లాక్‌బెల్ట్ సాధించింది. జాతీయ స్థాయి కరాటే పోటీలలో కటా, కుంతి విభాగాలలో బంగారు పతకం సాధించింది. సామాన్య నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన ఆమె తన తండ్రి గంటా శ్రీను వద్ద శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి 50 టోర్నమెంట్‌లలో పాల్గొంది. 2008లో పాలకొల్లులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో మొదటి బంగారు పతకం సాధించింది. 30 గ్రాండ్ ఛాంపియన్‌షిప్‌లు, 10 అవార్డులు సాధించింది.

వాలీబాల్ జాతీయ స్థాయి క్రీడాకారిణి ఏసుమణి



ఆకివీడు మండలం సమతానగర్ ప్రాంతానికి చెందిన బొండా ఏసుమణి అండర్ 19వాలీబాల్ జాతీయ స్థాయి పోటీలలో సత్తా చాటింది. ఏఎస్ఎన్ రాజు స్పోర్ట్స్ అకాడమిలో కోచ్ నాగరాజు వద్ద శిక్షణ పొంది, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలలో పశ్చిమగోదావరి జిల్లా తరుపున 2023-24లో తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలలో రెండవ స్థానం సాధించింది. జాతీయ స్థాయికి ఎంపికై 2023-24లో కర్ణాటకలో నేషనల్ గేమ్స్‌లో పాల్గొంది. 2024-25లో రాష్ట్ర, జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొంది.

ఉద్యోగం వదిలి.. క్రీడాకారులకు శిక్షణలో సయ్యద్ సుభాన్



భీమవరంటౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): క్రీడలపై ఆసక్తితో ఉద్యోగం వదిలిపెట్టి మరీ క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు భీమవరం పట్టణానికి చెందిన సయ్యద్ సుభాన్. చాంపియన్ స్పోర్ట్స్ అకాడమి ఏర్పాటు చేసి దాదాపు 2వేల మందికి కరాటే, రైఫిల్ షూటింగ్, ఆర్చరీల్లో క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు. ఆయన వద్ద శిక్షణ పొందిన భీమవరం పట్టణానికి చెందిన సురేష్ ప్రస్తుత డీఎస్సీలో పీఈటీ ఉద్యోగం సంపాదించారు. సుభాన్ కరాటేలో డాన్ 5ర్యాంకు బ్లాక్ బెల్ట్ సాధించారు. ఏషియన్ కరాటే పోటీలకు జడ్జిగా నిర్వహించారు. షూటింగ్‌లో ఆయన వద్ద శిక్షణ పొందిన యువత రాష్ట్ర, జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించారు. దేశానికి మంచి పేరు, పతకాలు సాధించేలా క్రీడాకారులను తర్ఫీదు ఇవ్వాలన్నదే లక్ష్యంగా చెబుతున్నారు. క్రీడల్లో ఆసక్తి ఉన్నవారికి అండగా నిలుస్తున్నారు.

తణుకు క్రీడా రత్నాలు

తణుకు, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): తణుకు పట్టణంలో ఎందరో క్రీడాకారులు అంతర్జాతీయ పోటీల్లో రాణించారు. ఒలింపిక్ పోటీల్లో పాల్గొన్న యువతి వచ్చే ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా కఠోర సాధన చేస్తోంది. బ్యాడ్మింటన్‌లో యువత పతకాల పంట పండించారు.

నాన్న ప్రోత్సాహంతో ఒలింపిక్ పరుగు..



నాన్న నాకు ప్రేరణ. నాన్న ఆశయాల మేరకు ఒలింపిక్స్ వరకు పరుగెత్తాను. వచ్చే ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే నా ముందున్న లక్ష్యం అంటూ తణుకు పట్టణానికి చెందిన దండి జ్యోతికశ్రీ తన క్రీడా ప్రయాణం వివరించింది. కోచ్ సీతారామయ్య వద్ద శిక్షణతో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పతకాలు సాధించాను. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 33వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో అండర్-18 కేటగిరిలో 400 మీటర్లు పరుగు పందెంలో బంగారు పతకాన్ని సాధించాను. త్రివేండ్రంలో ఐదో ఓపెన్ 400మీటర్ల జాతీయ స్థాయి పోటీల్లో కాంస్యం, వరల్డ్ రిలేలో ఒలింపిక్స్‌కు అర్హత సాధించాను. ప్రథమ ఏషియన్ మిక్స్‌డ్ రిలేలో గోల్డ్ మెడల్, ఇండియన్ గ్రాండ్ ఫిక్స్-3 బెంగళూరులో గోల్డ్, ఇంటర్ స్టేట్ నేషనల్ అథ్లెటిక్ చాంపియన్ షిప్‌లో సిల్వర్, 37వ జాతీయ గేమ్స్‌లో సిల్వర్, గోల్డ్, 62వ నేషనల్ ఓపెన్ అథ్లెటిక్ చాంపియన్ షిప్‌లో గోల్డ్, 25వ ఏషియన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో బ్రాంజ్, 4వ నేషనల్ ఓపెన్ 400మీటర్ల అథ్లెటిక్ చాంపియన్ షిప్‌లో గోల్డ్, 61వ నేషనల్ ఓపిన్ అథ్లెటిక్ చాంపియన్ షిప్‌లో బ్రాంజ్, 36వ నేషనల్ గేమ్స్‌లో సిల్వర్, 61వ నేషనల్ ఇంటర్ స్టేట్ సీనియర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్‌లో గోల్డ్, 7వ ఇంటర్‌నేషనల్ రిలే కప్‌లో రెండు గోల్డ్ మెడల్స్ సాధించాను.

- దండి జ్యోతికశ్రీ, అథ్లెట్

భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తా



బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రకటించిన అండర్-15 బాలుర ర్యాంకింగ్స్‌లో 747 పాయింట్లతో ఇండియాలో ప్రథమ ర్యాంకు సాధించా. భారత బ్యాడ్మింటన్‌కు జట్టుకు ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించడమే లక్ష్యం. ఇప్పటివరకు జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో 9 బంగారు, 6రజత, 5 కాంస్య పతకాలు సాధించాను. చైనాలో ఏషియన్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌కు ఇండియా టీమ్‌కు ప్రాబబుల్స్‌కు ఎంపికయ్యాను. జైపూర్, గోవా, బెంగళూరులో జరిగిన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలలో మూడు సార్లు అండర్-15 మిక్స్‌డ్ డబుల్స్ విభాగాలలో పాల్గొని హ్యాట్రిక్ గోల్డ్ మెడల్స్ సాధించాను.

- సమ్మెట్ల హేమంత్‌శ్రీ, తణుకు

ఒలింపిక్స్‌లో ఆడతా..



భవిష్యత్‌లో ఒలింపిక్స్‌లో ఆడాలనే లక్ష్యం. ఇప్పటి వరకు గుజరాత్‌లోని నేషనల్ స్కూలు గేమ్స్ అండర్-17 బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌లో రజత పతకం సాధించాను. మదనపల్లిలో జరిగిన అండర్-14లో బంగారు పతకం, నెల్లూరులో జరిగిన అండర్-17 స్టేట్ బ్యాడ్మింటన్ పోటీల్లో కాంస్యం సాదించాను.

- ఆకుల త్రిలోక్, తణుకు

ప్రపంచ చాంపియన్ లక్ష్యం



భవిష్యత్‌లో బ్యాడ్మింటన్‌లో చాంపియన్ కావాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నా. ఇప్పటి వరకు అండర్-14, అండర్-15, అండర్-13 రాష్ట్రస్థాయి పోటీలలో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించాను. లక్ష్యం చేరుకునేందుకు అకాడమీలో సాధన చేస్తున్నా. జాతీయ స్థాయిలో రాణించి అంతర్జాతీయ వేదికపైకి వెళతా.

- మానే మనోజ్ఞ, తణుకు

ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది



క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం బాగుంది. జూనియర్ ఇండియా బ్యాడ్మింటన్ టీమ్‌కు కోచ్‌గా ఎంపికయ్యాను. 25 ఏళ్లుగా బ్యాడ్మింటన్‌లో శిక్షణ ఇస్తున్నాను. ఇప్పటి వరకు ఏడుగురు అంతర్జాతీయ క్రీడాకారులుగా 65మంది జాతీయ క్రీడాకారులుగా తయారు చేశాను. ప్రభుత్వం క్రీడా కోటా రెండు నుంచి మూడు శాతం పెంచడం చాలా ఆనందం.

- సమ్మెట్ల సతీష్‌బాబు, పీడీ, ఏకేటీపీ హైస్కూల్, తణుకు



శ్రీహరికోట వెళుతున్న పాలకొల్లు డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు

అంతరిక్ష పరిశోధన ప్రయోగశాలకు పాలకొల్లు విద్యార్థినులు

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు 80 మంది, 10 మంది అధ్యాపకులు గురువారం నెల్లూరు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష పరిశోధనా ప్రయోగశాలకు వెళ్లారు. అంతరిక్ష ప్రయోగశాలలోని పలు అంశాలను తెలియజేయడం లక్ష్యంగా భౌతిక శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ వెంకటరమణ పర్యవేక్షణలో వెళ్లినట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ సి.రవి శంకర్ తెలిపారు. తమ కళాశాల విద్యార్థులకు అవకాశం కల్పించిన ఇస్రో యాజమాన్యం, శాస్త్రవేత్తలకు ప్రిన్సిపాల్ శోభారాణి కృతజ్ఞతలు తెలిపారు.

పాపికొండల పర్యటనకు వెళ్లొచ్చు..

- ప్రత్యేక బోటు సిద్ధం చేస్తున్న అటవీ శాఖ
- పర్యాటకులు కొరుటూరు రిసార్ట్‌కు చేరడానికి ఏర్పాట్లు
- వచ్చే నెలలో అందుబాటులోకి రానున్న బోటు



యానాం వద్ద సిద్ధమవుతున్న అటవీశాఖ బోటు

పోలవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పాపికొండల పర్యాటకానికి అటవీశాఖ తరపున ప్రత్యేక బోటు సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో కొరుటూరు వద్ద నిర్మించిన ఉడెన్ రిసార్టులను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న పర్యాటకుల సౌకర్యార్థం అటవీశాఖ క్యాంప్ నిధులు రూ.20 లక్షలతో యానాం తాళ్లరేవు వద్ద ప్రత్యేక బోటు తయారు చేస్తున్నారు. ఈబోటులో ఒకేసారి 20 మంది ప్రయాణించవచ్చు పెట్రోలు డీజిల్‌తో నడిచే ఈ బోటు వేగంలో కూడా టూరిజం బోట్లను మించిన సామర్థ్యం కలిగి ఉంటుందని చెబుతున్నారు. సెప్టెంబరు మొదటి వారంలో ఈ బోటు పాపికొండల అభయారణ్యంలో అరంగ్రేటం చేయనుందని అటవీక్షేత్రాధికారి ఎస్‌కె వలీ తెలిపారు. ఈ బోటు ప్రత్యేకత ఏమిటంటే టూరిజం బోటు కంటే వేగంగా వెళుతుంది. ఇది కేవలం అటవీశాఖ కాటేజీలు బుక్ చేసుకున్న వారికి, అటవీశాఖ అధికారులకు మాత్రమే. గతంలో అటవీశాఖ కాటేజీలు బుక్ చేసుకున్న పర్యాటకులు టూరిజం బోట్లు పేరంటాలపల్లి వెళ్లి వచ్చేవరకూ వేచి చూడాల్సి వచ్చేది. ఈ బోటు సర్వీసులోకి వచ్చిన తర్వాత అటవీశాఖ ఉడెన్ కాటేజీలు బుక్ చేసుకున్న వారి రాకపోకలకు అటవీశాఖ అధికారులు పాపికొండల అభయారణ్యం పరిధి గోదావరి నదిలో ఇతర కార్యకలాపాలు నిర్వహించడానికి కూడా ఉపయోగపడనుంది ఈ బోటు. దీంతో అటవీశాఖ ఉడెన్ కాటేజీల పర్యాటకానికి మరింత డిమాండ్ పెరగనుంది. ఇంకొక విషయం కొరుటూరు కాటేజీల వంటశాలలలో పర్యాటకులకు రుచికి కావలసినంత విందులు, అటవీ అందాల వినోదాలు కూడా అటవీ శాఖ ఏర్పాటు చేయనుంది.



సైన్సు మ్యూజియంలో పరికరాలను పరిశీలిస్తున్న అడిషినల్ డైరెక్టర్, ఏఎంవో

సైన్సు మ్యూజియం అభివృద్ధికి రూ.15లక్షలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సైన్స్ పాఠ్యాంశాలు, సాంకేతిక అంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహనకోసం ఏలూరు జీఎంసీ బాలయోగి సైన్స్ పార్కు, మ్యూజియం ఆధునికీకరిస్తున్నారు. తాజాగా రూ.15లక్షల నిధులను విడుదలచేయాలని నిర్ణయించినట్టు సమగ్రశిక్ష అడిషినల్ డైరెక్టర్, స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ నాగేశ్వరరావు తెలిపారు. గురువారం సైన్సు మ్యూజియం సందర్శించి నవీకరణ పనులను పరిశీలించారు. ఇప్పటికే రూ.40 లక్షలు ఖర్చు చేశామని, కొత్తగా సైన్స్ పరికరాల కొనుగోలుకు రూ.15 లక్షలు వెచ్చిస్తామన్నారు. మ్యూజియంను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సందర్శించేందుకు వీలుగా 15రోజుల్లో షెడ్యూలును ఖరారు చేస్తామన్నారు. అగస్త్య ఫౌండేషన్ సహకారంతో కొన్ని పరికరాలను పార్కులో ఏర్పాటుచేస్తామన్నారు. విద్యార్థులు సొంతంగా ప్రయోగాలుచేస్తూ సైన్స్ పాఠ్యాంశాలను అర్థం చేసుకునేలా వెసులుబాటు కల్పిస్తామన్నారు. అనుభవజ్ఞుడైన ఒక సైన్స్ టీచరును అందుబాటులో ఉంచామన్నారు. సమగ్రశిక్ష జిల్లా ఏఎంవో ఆర్.రామారావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు, తదితరులు పాల్గొన్నారు.

2027 నాటికి రైల్వే గేట్లు ఉండవు



రైల్వేగేటు దగ్గర మ్యాప్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

ఆకివీడు ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ డివిజన్ పరిధిలో 2027నాటికి రైల్వేగేట్లు లేకుండా చేయాలన్నదే సౌత్ సెంట్రల్ రైల్వే లక్ష్యమని సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. గురువారం దుంపగడప, సిద్ధాపురం వైపు వెళ్ళు రైల్వేగేట్లు దగ్గర పరిస్థితులను ఆయన పరిశీలించి మాట్లాడారు. డివిజన్ పరిధిలో 432 రైల్వేగేట్లు ఉన్నాయన్నారు. ఇప్పటికే ఆర్‌వోబీ, ఆర్‌యూబీల ద్వారా 50 గేట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. 180 ప్రతిపాదనలు సర్వేకు వచ్చాయన్నారు. 18 మంజూరయ్యాయని, 80 ఆర్వీఎస్‌ఎల్‌లో ఉన్నాయన్నారు.

ప్రతి కుటుంబంలో ఆరోగ్యం, ఐశ్వర్యం నెలకొనాలి



గణపతికి పూజ చేస్తున్న కేంద్ర మంత్రి వర్మ దంపతులు

భీమవరం టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం నెలకొనాలని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆకాంక్షించారు. భీమవరంలోని బీజేపీ నరసాపురం పార్లమెంట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో కేంద్రమంత్రి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగకు వాడే మట్టి విగ్రహాలు, పూజా సామగ్రి, వస్త్రాలు, అలంకరణలు వంటివి స్థానిక కళాకారులు, కార్మికులు తయారుచేసిన స్వదేశీ ఉత్పత్తులనే కొనుగోలు చేసి వినియోగించాలని ఆయన కోరారు. ఈ వేడుకలలో భూపతిరాజు వెంకటేశ్వరి దేవి, అల్లూరి సాయి దుర్గరాజు, కలిదిండి వినోద్ వర్మ, బుద్ధ రాజు బలరామకృష్ణరాజు పాల్గొన్నారు.

2న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

సారధ్యం యాత్రలో భాగంగా వచ్చేనెల 2న భీమవరం వస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పిలుపునిచ్చారు. భీమవరంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు అయినపూడి శ్రీదేవి అధ్యక్షతన సమావేశం జరిగింది.

నాచు సాగుతో ఉపాధి అవకాశాలు: కలెక్టర్



సముద్ర నాచును పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

నరసాపురం రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వేటతో పాటు ఇతర ప్రత్యామ్నాయ ఉపాధి కూడా మత్స్యకారులకు చూపించి వారిలో ఆర్థిక పరిపుష్టి పెంచాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. గురువారం పీఎంలంక కమ్యూనిటీ భవనంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సముద్ర నాచు పెంపకంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రస్తుతం సముద్ర నాచుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. మందులు, కాస్మోటిక్స్, ఐస్‌క్రీమ్‌లతో పాటు అనేక వస్తువుల తయారీలో నాచును వినియోగిస్తున్నా రన్నారు. జిల్లాలో పీఎంలంకను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. శిక్షణలో భాగంగా ఎంపిక చేసిన మహిళల్ని విశాఖ, శ్రీకాకుళం జిల్లాకు తీసుకెళ్లాతామన్నారు.

ఉండి పీహెచ్‌సీలో కలెక్టర్ తనిఖీ

ఉండి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు వైద్యసేవలందించడంలో ఎటువంటి అలసత్వం పనికిరాదని కలెక్టరు చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులు, ల్యాబ్, స్టాఫ్ రూమ్‌లను, సిబ్బంది హాజరుపట్టీని పరిశీలించారు. ఎంతమంది సిబ్బంది పనిచేస్తున్నారు ? మందులు అందుబాటులో ఉంచుతున్నారా? అంటూ వారిని ఆరా తీశారు. జ్వరాలు, సీజనల్ వ్యాధులు, గర్భిణుల వివరాలు తెలుసుకున్నారు.

జగన్నాథపురంలో కేంద్ర బృందం పర్యటన

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో కేంద్ర బృందం గురువారం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామంలో చెత్త నుంచి సంపద సృష్టి తయారీ కేంద్రం నిర్వహణను పరిశీలించారు. చెత్త, మిషనరీ పనితీరు, పర్యావరణ పరిశుభ్రత, పచ్చదనం తదితర అంశాలను గ్రేడ్‌ల వారీగా కేంద్ర బృంద సభ్యులు మధుమతి పరిశీలించారు. సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, కార్యదర్శి బి శ్రీనివాస చంద్రరాజు, ఎంఆర్‌సీ ఎం.రవికిరణ్ పాల్గొన్నారు.

ప్రజల్ని తప్పుదోవ పట్టించొద్దు: మోషేన్‌రాజు

భీమవరం టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్ భీమవరంలోనే నిర్మించాలని, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు వివాదాస్పదం చేయవద్దని శాసనమండలి ఛైర్మన్ కొయ్యేమోషేన్ రాజు సూచించారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాటలు ప్రజల్ని తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని అన్నారు. కలెక్టరేట్‌ను ఉండిలో నిర్మించాలని మిమ్మల్ని ఎవరు కోరారని ప్రశ్నించారు. భీమవరంలో కలెక్టరేట్ నిర్మాణానికి స్థలాలు లేవనడం సత్య దూరం అన్నారు. గత ప్రభుత్వం కేటాయించిన మార్కెట్ యార్డు స్థలం సిద్ధంగా ఉందని, నిధులు విడుదల చేసి టెండర్లు పిలిచారని అన్నారు. నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రభుత్వం సేకరించిన 72 ఎకరాలు, ప్రస్తుత కలెక్టరేట్ సమీపంలో 10 ఎకరాలు దేవస్థానం భూమి, తహసీల్దార్ కార్యాలయం ఆరు ఎకరాలు భూములు సిద్ధంగా ఉన్నాయన్నారు.

మెగా డీఎస్సీ -2025 ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రారంభం

- తొలి రోజు విచ్చేసిన 804 మంది అభ్యర్థులు
- నేడు మరో 270 మంది ధ్రువపత్రాల పరిశీలన

ఏలూరు అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకాలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సెలక్షన్ జోన్‌లోకి పరిగణనలోకి తీసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. స్థానిక సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మొత్తం 1,074 పోస్టుల భర్తీకి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కోసం జిల్లా విద్యాశాఖ ఏర్పాటు చేసిన 23 టీమ్‌లు/కమిటీలు/కౌంటర్లు ఒక్కో దానికి 50 మంది చొప్పున అభ్యర్థులను రాష్ట్రస్థాయిలో కేటాయించారు. ఈమేరకు తొలిరోజున అన్ని కేడర్లకు సంబంధించి 804మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు జారీఅయ్యాయి. సంబంధిత అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు నిర్దేశించిన 17 కౌంటర్లలో గురువారం ఉదయం 8.30 గంటల నుంచే పరిశీలన ప్రక్రియను ప్రారంభించినా పూర్తిస్థాయిలో మొదలయ్యేసరికి మధ్యాహ్నం పన్నెండు గంటలైంది. మిగతా 270మంది అభ్యర్థుల లాగిన్‌లకు కాల్‌లెటర్ల జారీ, వారి ధ్రువపత్రాల పరిశీలనకు ఆరు టీమ్‌ల కేటాయింపు గురువారం సాయంత్రం నుంచి ప్రారంభమైందని, వీరందరికీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి చేపడతామని ఉమ్మడి జిల్లా డీఈవో, డీఎస్సీ కన్వీనర్ ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఎటువంటి సాంకేతిక అవరోధాలు తలెత్తలేదని వివరించారు. పరిశీలనకు జిల్లా విద్యాశాఖ చేసిన ఏర్పాట్లపై ప్రభుత్వ నోడల్ ఆఫీసర్‌గా నియమి తులైన సమగ్రశిక్ష రాష్ట్ర ఏఎంవో నాగేశ్వరరావు సంతృప్తి వ్యక్తం చేశారు.

తొలుత దివ్యాంగులతో పరిశీలన ప్రారంభం

తొలిరోజున నిర్దేశించిన 804మంది అభ్యర్థుల్లో పలు వైకల్యాలున్న వారికి మొదటి ప్రాధాన్యతనిచ్చి వారి అకడమిక్ సర్టిఫికెట్లను పరిశీలించారు. వైకల్య ధ్రువపత్రాల పరిశీలన, వైకల్య నిర్ధారణల నిమిత్తం ఏలూరు, విశాఖపట్నంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రులకు వారిని పంపించారు. కాగా దూర విద్యా విధానంలో విద్యార్హతలు సాధించిన డీఎస్సీ సెలెక్టెడ్ అభ్యర్థులు 10+2+3 ప్యాట్రన్‌లో రెగ్యులర్/ప్రైవేటుగా చదివిన వారినే అర్హులుగా గుర్తిస్తామని విద్యాశాఖ అధికారుల స్పష్టం చేశారు. ఇక దరఖాస్తు సమయంలో అభ్యర్థి ఎంచుకున్న యాజమాన్యంలో ఎటువంటి మార్పులకు అవకాశం లేదని తేల్చిచెప్పారు. దరఖాస్తుల్లో అభ్యర్థుల పేర్లలో స్వల్ప సవరణలు, కుల ధ్రువీకరణ పత్రాలు 15 ఏళ్ల క్రితంనాటివి తీసుకురావడం, డిగ్రీ, బీఈడీల అర్హతలు, తదితర సమస్యలు కొందరు అభ్యర్థుల విషయంలో తలెత్తాయి. వీటిలో కొన్నింటిని గ్రీవెన్స్ సెల్‌కు, ఉన్నతాధికారులకు పరిష్కారంకోసం నివేదించి క్లియర్ చేశారు.



ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో సర్టిపికెట్ల వెరిఫికేషన్ చేస్తున్న డీఈవో, సిబ్బంది



బోర్డుపై నంబర్లు చూస్తున్న దృశ్యం

పరిశ్రమల కేంద్రం డీడీకి జేడీగా పదోన్నతి



సుబ్రహ్మణ్యేశ్వరరావు

ఏలూరు,ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పరిశ్రమల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న పి.సుబ్రహ్మణ్యేశ్వరరావుకు జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ కమిషనర్ యువరాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యాలయం నుంచి డిప్యూటీ డైరెక్టర్‌గా గత ఏడాది అక్టోబరులో ఏలూరుకు బదిలీపై ఆయన వచ్చారు. ఏలూరు జీఎం(జేడీ ర్యాంకు) అధికారి రిటైర్ కావడంతో సుబ్రహ్మణ్యేశ్వరరావు పూర్తి అదనపు బాధ్యతలతో జీఎంగా కొనసా గుతున్నారు. ఇప్పుడు పదోన్నతి లభించ డంతో జీఎంగా ఇక్కడే కొనసాగనున్నారు. మరో మూడు నెలల్లో ఆయన పదవీ విరమణ చేసే సమయంలో ఈ పదోన్నతి లభించడం విశేషం.

టీచర్‌గా ఎంపికైన కానిస్టేబుల్



కానిస్టేబుల్ నాగరాజు

చాట్రాయి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి చేస్తూ విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాలనేది అతడి జీవితాశయం. కానీ ఉద్యోగ ప్రయత్నంలో ఏడేళ్ల క్రితం పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికవడంతో అందులో పనిచేస్తూ, మరోవైపు మెగా డీఎస్సీ-2025కి చదివి ఉద్యోగం పొందాడు. టీచర్‌గా ఎంపికై జీవిత లక్ష్యాన్ని సాధించాడు. చాట్రాయి మండలంలోని పర్వతాపురం గ్రామానికి చెందిన పొదిలి చిన్న నాగరాజు. తిరువూరు, మైలవరం పట్టణాలలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేసిన అతడు ఎటువంటి కోచింగ్ లేకుండానే ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా ఎంపికవడంతో అతడి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అతడిని పోలీస్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు అభినందించారు.

గణేశ్ నిమజ్జనాలకు ముందస్తు చర్యలు

- సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా
- పేరుపాలెం బీచ్‌లో ప్రమాదాల నివారణకు డ్రోన్‌లు
- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



విలేకర్లతో మాట్లాడుతున్న ఐజీ అశోక్‌కుమార్

నరసాపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్‌శాఖ ముందస్తుగా పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్టు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. గురువారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఆయన వార్షిక తనిఖీలు నిర్వహించి, రికార్డులను పరిశీలించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ నయీంతో కలిసి పెండింగ్ కేసులపై చర్చించారు. అనంతరం విలేకర్లతో ఆయన మా ట్లాడుతూ నిమజ్జనాల సమయంలో సమస్యాత్మక ప్రాంతాలపై గట్టి నిఘా ఉంచామన్నారు. గతంలో నిమజ్జనాల సమయంలో జరిగిన అల్లర్లను పరిగణనలోకి తీసుకుని ముందస్తుగా బైండోవర్ కేసుల్ని పెట్టబోతున్నామన్నారు. ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదన్నారు.

గంజాయి నిర్మూలనకు నిఘా

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు గట్టి నిఘా పెట్టామని ఐజీ అశోక్ కుమార్ తెలిపారు. గతంలో అరెస్టయిన నేరగాళ్ల కదలికలపై ఎప్పటికప్పుడు గమనిస్తున్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పెట్రోలింగ్ టీమ్‌లను పెంచుతున్నామన్నారు. అన్ని హైవేలపై తరచూ తనిఖీలు చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు. గత ఏడాదితో పోలిస్తే క్రైం రేటు తగ్గిందన్నారు. అయితే ఏలూరు జిల్లాలో ప్రమాదాల సంఖ్య పెరిగిందన్నారు. దీనిపై దృష్టి పెట్టామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కువ సైబర్ నేరాలు సీనియర్ సిటిజన్లను టార్గెట్‌గా చేసుకుని జరుగుతున్నాయన్నారు. బ్యాంకు సిబ్బంది సహకారం, ప్రజలకు అవగాహన కల్పించి ఈ నేరాలను తగ్గించేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తుందన్నారు.

పేరుపాలెం బీచ్‌పై ప్రత్యేక దృష్టి

పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యాటక ప్రాంతంగా పేరుగాంచిన పేరుపాలెం బీచ్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఐజీ అశోక్ కుమార్ చెప్పారు. తరచూ జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు డ్రోన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 24 గంటలు పోలీసులు బీచ్‌లో ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. దీని కోసం రెండు ప్రదేశాల్లో అవుట్ పోస్టులు పెడతామన్నారు. ఈ ఏడాది కార్తీక మాసంలో ప్రమదాలు జరగకుండా ఇప్పటి నుంచే ప్లానింగ్ చేస్తున్నామన్నారు. బీచ్ పొడుగున ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ భీమారావు, డీఎస్పీ శ్రీవేద, సీఐలు దుర్గప్రసాద్, యాదగిరి, ఎస్‌ఐలు ముత్యాలరావు, జయలక్ష్మి, వాసు, వెంకటసురేష్ పాల్గొన్నారు.

చేపల లోడు లారీ తిరగబడి కూలీ మృతి



దెందులూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దెందులూరు-గుండుగొలను జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీలో ప్రయాణిస్తున్న ఒక కూలీ అక్కడక్కడే మృతి చెందగా, ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. గుడివాడ నుంచి నారాయణపురం వైపు 9 మంది బీహార్ కూలీలను ఎక్కించుకుని చేపల లోడు వెళ్తోంది. స్థానికంగా ఉన్న పున్నమి హోటల్ దాటిన తర్వాత గుండుగొలను జం క్షన్ సమీపంలో లారీ ముందు వెళ్తున్న కారు సడన్ బ్రేక్ వేయడంతో, లారీని అదుపు చేసే క్రమంలో రోడ్డుపైకి తిరగబడింది. దీంతో కింద పడిన ఒక కూలీ సద్దా హుస్సేన్(48)పై భారీగా చేపల ట్రేలు పడ్డాయి. దీంతో ఊపిరాడక హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఎనిమిది కూలీలు గాయపడటంతో వారిని హైవే పోలీసులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నలుగురిని విజయవాడకు తరలించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని పోలీస్‌లు తెలిపారు. ఎస్‌ఐ కె.శివాజీ కేసు నమోదు చేశారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

ఆపరేషన్ ట్రేస్‌లో అనాథబాలుడి గుర్తింపు

ఏలూరు క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శక్తిటీమ్ టీమ్ ఇన్‌చార్జి, సీఐ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ఒక బాలుడి నుంచి వివరాలు సేకరించి తండ్రి చెంతకు చేర్చారు. గత ఐదేళ్లుగా ఏలూరు సమీపంలోని శనివారపుపేట ప్రభుత్వ బాలుర వసతి గృహంలో రామకృష్ణ(17)అనే బాలుడు ఉంటున్నారు. బాలుడి కోసం తల్లిదండ్రులెవ్వరూ రాకపోవడంతో ఆపరేషన్ ట్రేస్‌లో భాగంగా వివరాలు సేకరించారు. బాలుడికి 12 ఏళ్ల వయస్సులో తల్లి మరణించింది. ఆ బాలుడిని తండ్రి హోమ్‌లో వదిలి వెళ్లిపోయాడు. తండ్రి ఎంతకీ రాకపోవడంతో హోంలోనే ఉంటున్నాడు. ఆ బాలుడు తండ్రి చంద్రరావు మరో మహిళను పెళ్లి చేసుకుని ముసునూరి మండలం బలివేలో ఉంటున్నాడు. చివరకు పోలీసులు గుర్తించి కుమారుడిని అప్పగించారు. ఐదేళ్ల తరువాత రామకృష్ణ తండ్రిని కలవడంతో ఆనందం వ్యక్తం చేశారు.

రోజు వ్యవధిలో తండ్రీకూతుళ్ల మృతి



అంత్యక్రియలు నిర్వహిస్తున్న పుష్పావతి

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):ఒక రోజు వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన తండ్రీ, కూతుళ్లు బుధవారం మృతి చెందడంతో వినాయక చవితి పండుగ రోజున ఆ ఇంట్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలోని రామచంద్రపురానికి చెందిన బేతా వెంకట్రావు ద్వితీయ కుమార్తె బేతా జయశ్రీ(22)కి ఎప్పటి నుంచో అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో ఈ నెల 25న పరిస్థితి విషమించి మృతి చెందింది. కుమార్తె మరణాన్ని జీర్ణించుకోలేని తండ్రి బేతా వెంకట్రావు(55) వినాయక చవితి రోజు బుధవారం తన ఇంట్లో మృతి చెందాడు. తండ్రి కూడా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రోజు వ్యవధిలో ఒకే కుటుంబంలో ఇద్దరూ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఒకే కుటుంబంలో ఇద్దరు చనిపోవడంతో బంధువులు భయపడి తండ్రి అంత్యక్రియలు నిర్వహించడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. దీంతో పెద్ద కుమార్తె వీర పుష్పావతి కన్నీటి పర్యంతమవుతూ అంత్యక్రియలు జరిపించారు.

దైవ దర్శనానికి వెళ్తున్న వారిపై కూలిన చెట్టు

తీవ్రగాయాలతో ఒకరి మృతి
భార్య, కుమారుడికి తీవ్ర గాయాలు



చెట్టుకూలి మోటార్ సైకిల్‌పై పడిన దృశ్యం

ద్వారకాతిరుమల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దురదృష్టం ఆ కుటుంబాన్ని వెంటాడింది. బైక్‌పై దైవదర్శనానికి బయల్దేరిన ఒక కుటుంబంపై అకస్మాత్తుగా చెట్టుకూలి పడటంతో ఒకరు మృతి చెందారు. ద్వారకాతిరుమల మండలం సూర్య చంద్రరావుపేట వద్ద గురువారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. భార్య, కుమారుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామానికి చెందిన కోటిపల్లి వెంకట సుబ్బారావు(45) తన భార్య నాగదుర్గవేణి, కుమారుడితో కలిసి బైక్‌పై చినవెంకన్న దర్శనార్థం గురువారం ఉదయం ద్వారకాతిరుమలకు బయల్దేరారు. సూర్య చంద్రరావుపేట అనే గ్రామం వద్దకు వచ్చేసరికి వర్షం ఎక్కువైంది. అదేసమయంలో రోడ్డు పక్కనున్న చెట్టు ఒక్కసారిగా కుప్పకూలి వారు ప్రయాణిస్తున్న బైక్‌పై పడింది. ఈ ప్రమాదంలో సుబ్బారావు, అతని భార్య, కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను హుటాహుటిన అంబులెన్స్‌లో ఆశ్రం ఆసుపత్రికి తరలిస్తుండగా సుబ్బారావు మార్గమధ్యలో మృతి చెందాడు. భార్య, కుమారుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ద్వారకాతిరుమల ఎస్.ఐ. టి.సుధీర్ కేసు నమోదు చేశారు.

మోటార్ సైకిళ్ల దొంగ అరెస్టు

నాలుగు వాహనాలు స్వాధీనం



నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయానికి భక్తులు వేసుకుని వచ్చే మోటార్ సైకిళ్లను టార్గెట్ చేసి దొంగిలిస్తున్న ఒకరిని పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. గత కొన్నాళ్లుగా చాట్రాయి మండలం పోలవరానికి చెందిన కోట రవి శేషాచలం పరిసరాల్లో వరుస బైక్ చోరీలకు పాల్పడుతూ పోలీసుల నుంచి తప్పించుకుంటున్నాడు. వలపన్ని చాకచక్యంగా నిందితుడిని పట్టుకుని నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు భీమడోలు సీఐ యూజె విల్సన్, ఎస్‌ఐ టి.సుధీర్‌లు తెలిపారు. ఆలయ పార్కింగ్, బస్టాండ్ ప్రాంతంలో బైక్‌లను పార్క్ చేసి భక్తులు దైవదర్శనానికి వెళ్లి వస్తుంటారు. ద్వారకాతిరుమల నుంచి వెంకటకృష్ణాపురం వెళ్లే రోడ్డులో వలపన్ని రవిని పట్టుకున్నారు. కోడిపందేలు, పేకాట వంటి వ్యసనాలకు బానిసై చోరీలకు అలవాటు పడినట్టు సిఐ వివరించారు. చాట్రాయి, ఇబ్రహీంపట్నం, ఏలూరు, తదితర పోలీస్‌స్టేషన్లలో 18 పైబడి కేసులు నమోదైనట్లు చెప్పారు. పలు కేసుల్లో ఇతను జైలుకు వెళ్లి వచ్చినట్లు విచారణలో తేలిందని తెలిపారు. దర్యాప్తు బృందంలో తమతో పాటు కానిస్టేబుళ్లు సి.హెచ్.లక్ష్మీనారాయణ, వి.జె.ప్రకాష్‌బాబు ఉన్నారు.

వేగంగా వచ్చి బోల్తా కొట్టిన పాల వ్యాను



బోల్తాకొట్టిన పాల వ్యాను

పెనుగొండ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలం వడలి గ్రామం నుంచి పిట్టల వేమవరం రోడ్డులో గురువారం పాల వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టిది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.వడలి నుంచి పిట్టల వేమవరం మీదుగా ముక్కామల వరకు రోడ్డును అద్భుతంగా నిర్మించారు. దీంతో సిద్ధాంతం మీదుగా వెళ్లాలిసన పలు వాహనాలు వడలి - పిట్టల వేమవరం దారిపడుతున్నాయి. సిద్ధాంతం హైవేకి షార్ట్ కట్ కావడంతో ప్రతి ఒక్కరూ ఈ రహదారిని ఎంచుకుని రాకపోకలు సాగిస్తున్నారు. దీని కారణంగా ఈ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డుకు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు మార్జిన్ బురదమయమై సింగిల్ రోడ్డు కావడంతో వాహనాలు ఎదురెదురుగా వేగంగా వచ్చి ఢీకొంటూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. పలు ప్రమాదాలలో యువకులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి.ప్రమాదాల నివారణకు సమస్యను పరిష్కరించి ప్రయాణికులు సురక్షితమైన ప్రయాణానికి కృషి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

డిజిటల్ అరెస్టు పేరుతో బెదిరింపు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరుతో జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ కోట సునీతను సైబర్ నేరగాళ్లు భయాందోళనకు గురిచేశారు. కర్ణాటక టెలికాం అథారిటీ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ గురువారం ఉదయం పదిన్నర గంటల నుంచి 45 నిమిషాలు ఇంగ్లీష్‌లో మాట్లాడుతూ భయాందోళనకు గురి చేశారని తెలిపింది. మొబైల్ నుంచి ఇల్లీగల్ కాల్స్, ఫోటోలు, వీడియోలు సెండ్ చేసినందుకు కర్ణాటక గాంధీ నగర్‌లోని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్టు భయపెట్టారన్నారు. పోలీసులతో మాట్లాడించాలంటూ గట్టిగా ప్రతిఘటించడంతో ఫోన్ కట్ చేశారన్నారు. ఈ ఘటనపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు డాక్టర్ సునీత తెలిపారు.

వ్యాను అపహరణ

ఏలూరు క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): షాపు ఆవరణలో నిలిపి ఉంచిన ఒక వ్యానును గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయాడు. ఏలూరు- చింతలపూడి రోడ్డు సుఖీభవ కల్యాణ మండపం ఎదురుగా శ్రీనివాస స్టీల్ దగ్గర టాటా వ్యానును యుగంధర్ అనే యజమాని షెడ్డులో పెట్టి తాళం కూడా అక్కడే పెడతారు. గుర్తు తెలియని వ్యక్తి బుధవారం అర్ధరాత్రి అక్కడకు వచ్చి తాళం తీసుకుని వెళ్లిపోయాడు. ఇదంతా సీసీ కెమెరాల్లో రికార్డయింది. వ్యాను రూ.మూడు లక్షల 40 వేల ఉంటుందని యుగంధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

స్నానం చేసేందుకు గోదావరిలో దిగి ఒకరి మృతి

యలమంచిలి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గోదావరిలో స్నానం కోసం దిగి ఒకరు మృతి చెందారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడి కుదురు మండలం పాశర్లపూడి గ్రామానికి చెందిన సోదరులు వేగి మోహనరావు(42), రామకృష్ణలు చించినాడ పుష్కరఘాట్ వద్ద గోదావరిలో స్నానానికి దిగారు. అన్నయ్య మోహనరావు ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతి చెందినట్టు ఎస్‌ఐ కె.గుర్రయ్య తెలిపారు. వేగి మోహనరావు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవనంసాగిస్తున్నాడు. ఈ నెల 14న బంధువుల వివాహం నిమిత్తం స్వగ్రామం వచ్చాడు. ఈ నెల 25న మోహనరావు, అతని సోదరుడు రామకృష్ణతో కలిసి నరసాపురం మండలం మత్స్యపురి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తూ చించినాడలోని పుష్కర్ ఘాట్ వద్ద గోదావరిలో స్నానానికి దిగారు. గోదావరిలో ఈత కొడుతున్న మోహనరావు ప్రమాద వశాత్తూ మునిగిపోయాడు. సోదరుడిని రక్షించేందుకు రామకృష్ణ ప్రయత్నించినప్పటికీ ఫలితం దక్కలేదు. గల్లంతైన మోహనరావు కోసం గోదావరిలో గాలించినా ఆచూకీ లభించలేదు. ఈ నెల 27న దర్భరేవు వద్ద గోదావరిలో మోహనరావు మృతదేహం లభ్యమైంది. వేగి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

వెండి కవచం బహూకరణ



● కొయ్యలగూడెం: ప్రధాన సెంటర్‌లో ఉన్న పురాతన గణపతి ఆలయంలో వినాయకుడికి 5కేజీల వెండి తొడుగును పట్టణానికి చెందిన సంకు ఇంటిపేరు గల కుటుంబ సభ్యులు బహూకరించారు. దీని విలువ సుమారు రూ.6 లక్షల వరకు అయ్యిందని దాతలు తెలిపారు.

దెందులూరు మండలంలో..



● దెందులూరు: మండలంలోని గోపన్నపాలెంలో బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి ఉత్సవాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, శ్రీరామవరంలో తెలుగు యువత అధ్యక్షుడు మోతుకూరి నానిబాబు, పెరుగుగూడెంలో శ్రీనివాస్, పి.దశరథ రామయ్యలు పాల్గొన్నారు.

1న సీపీఎస్ ఉద్యోగుల ఛలో విజయవాడ

ఏలూరు అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ స్థానే పాతపెన్షన్ విధానం అమలు, డీఏ బకాయిల చెల్లింపు, మధ్యంతర భృతి(ఐఆర్) తదితర డిమాండ్లపై ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం సెప్టెంబరు 1న నిర్వహించ తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గురువారం ఏలూరులో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టరేట్, ఆర్డీవో ఆఫీసు, ట్రెజరీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర ప్రభుత్వ కార్యాలయాలకు సంఘ నాయకులు తరలివెళ్లి ఛలో విజయవాడ వాల్‌పోస్టర్లను అంటించి, ఉద్యోగులతో సమావేశమయ్యారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి ఆర్.నాగదుర్గారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిదాటినా సీపీఎస్‌పై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. సంఘ జిల్లా నాయకులు రాంబాబు, వెంకటేశ్, సత్యనారాయణ, జయసింహ, జమాల్, రత్నరాజు, శాంతకుమారి, శ్రీరామ్, మనోజ్ పాల్గొన్నారు.

వివాదాల భూములపై అధికారుల విచారణ

బుట్టాయగూడెం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌ఆర్ భూసేకరణలో భాగంగా అధికారులు సేకరించిన భూముల విషయంలో వివాదాలున్న భూముల విషయమై గురువారం ఆర్డీవో ఎం.వి.రమణ, ఏలూరు ఎస్‌డీసీ కార్యాలయం ఏవో సతీష్‌లు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరిపారు. ఆర్‌అండ్‌ఆర్‌లో గిరిజనులకు భూములివ్వడానికి అధికారులు బుట్టాయగూడెం మండలంలో భూసేకరణకు చర్యలు చేపట్టగా పలువురు అభ్యంతరాలు లేవనెత్తారు. దీంతో అధికారులు గిరిజన, గిరిజనేతరుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఇరువర్గాల నుంచి వివరాలడిగి తెలుసుకున్నారు.అభ్యం తరాలు చెప్పిన కొందరు రికార్డులు చూపలేకపోయారని అధికారులు స్పష్టం చేశారు. విచారణ మాత్రమే జరిగిందని అధికారులు తెలిపారు. తహసీల్దార్ పీవీ చలపతిరావు అధికారులు పాల్గొన్నారు.

దౌర్జన్యం చేసిన ఫైనాన్స్ వారిపై చర్యలు తీసుకోవాలి

బుట్టాయగూడెం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):దళిత మహిళ దండే జ్ఞానసుందరిపై దౌర్జన్యం చేసిన దేవరపల్లికి చెందిన ఫైనాన్స్ వ్యాపరులపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు అందుగుల ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. కొయ్యలగూడెం మండలం అచ్యుతాపురానికి చెందిన జ్ఞానసుందరి అప్పు తీసుకుని వాయిదాలు చెల్లించకపోవడంతో వ్యాపారులు ఆమెపైన దౌర్జన్యం చేయడమే కాకుండా ఇల్లు ఖాళీ చేయాలని బెదిరించడాన్ని ఖండించారు. ఫైనాన్స్ వ్యాపారుల అగడాలు అధికం కావడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. దళిత మహిళపై దౌర్జన్యం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జనసేన పార్టీ బలోపేతమే 'సేనతో సేనాని' సమావేశం లక్ష్యం

దెందులూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర శ్రేయస్సు, జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశం సేనతో సేనాని అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు దెందులూరు నియోజకవర్గ నాయకురాలు, ఏపీ వడ్డీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఘంటశాల వెంకటలక్ష్మి అన్నారు.గురువారం సేనతో సేనాని వాల్ పోస్టర్లను దెందులూరు క్యాంప్ కార్యాలయంలో ఘంటశాల వెంటకలక్ష్మి, మాదేపల్లి(జాతిపూడి) సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు మోటేపల్లి పవన్ కుమార్, కలపాల ప్రేమ్ కుమార్‌లతో కలిసి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అధికారప్రతినిధి తాతపూడి చందు, మెడిచర్ల కృష్ణ, సత్యనారాయణ, గున్నం బాలు, కోలా రమణ పాల్గొన్నారు.

టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

ఏలూరు అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడి సమస్య పరిష్కారానికి హెచ్ఎంలు, ఉపాధ్యాయ సంఘాలు పరస్పరం సహకరించుకుంటూ ఐక్యంగా ముందుకు సాగాలని బుధవారం సాయంత్రం ఏలూరులో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశ వివరాలను, ఆమోదించిన తీర్మానాలను జిల్లా ప్రధానో పాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వడ్లపట్ల మురళీకృష్ణ గురువారం స్థానిక మీడియాకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరికీ ఒత్తిడిలేని ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశా రు. విద్యావ్యవస్థను బలోపేతం చేయడానికి ఆమోదయోగ్యమైన విషయాల్లో విద్యాశాఖాధికారులకు, ప్రభుత్వానికి సహరిస్తామన్నారు. సంఘ జిల్లా ప్రధానకార్యదర్శి రవీంద్ర, ఆర్గనైజింగ్ సెక్రటరీ సర్వేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్లు ప్రకాష్, శైలజ, కోశాదికారి శ్రీధర్, ఎంఈవోల సంఘ రాష్ట్ర కోశాధికారి ఎస్.నరసింహమూర్తి, ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) సభ్య సంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు.

సక్రమమా?.. అక్రమమా?

(5వ పేజీ తరువాయి)

చేయడానికి అధికార యంత్రాంగంలోని కొందరు అధికారులు, ఇతర పెద్దలు సహకారం లేకుండా చేయడం అసాధ్యమనే గుసగుసలు విన్పిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంత బహిరంగంగా అక్రమ బియ్యం వ్యాపారానికి తెగబడడం నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశమైంది. 2వ తేదీ నాటికే అనేక గ్రామాల్లో రేషన్ షాపుల వద్ద బియ్యం అయిపోయాయని సమాధానం వస్తున్నట్టు పలువురు కార్డుదారులు పేర్కొంటున్నారు.

తనిఖీలు సరే.. అనుమతుల ఊసేది : మామిడి తోటల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణాను ప్రస్తావిస్తూ 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 21వ తేదీన 'మామిడి తోటలో.. రేషన్ బియ్యం దందా!' శీర్షికన ప్రచురితమైన కథనం సంచలనం రేపింది. దీంతో గత గురువారం నూజివీడు పౌరసరఫరాల డీటీతో పాటు ఏలూరు, ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని ఇతర పౌర సరఫరాల శాఖ అధికారులు బృందంగా ఏర్పడి ఆగిరిపల్లి మండలంలో వరుస తనిఖీలను నిర్వహించారు. శోభనాపురం పరిధిలోని మామిడితోటలో పౌరసరఫరాల శాఖ గొడౌన్‌ను మించి దాదాపు వంద లారీలకు పైబడి(10 వేల నుంచి 20 వేల టన్నుల) సామర్థ్యం గల ప్రైవేట్ గొడౌన్లు దర్శనమిచ్చాయి. అయితే అధికారులు అక్కడ ఎటువంటి బియ్యం నిల్వలు లేవని తేల్చారే కాని, సీఆర్‌డీఏ పరిధిలోని శోభనాపురంలో నిర్మించిన ఈ గొడౌన్‌లకు అనుమతులు ఉన్నాయా? అను మతులు తీసుకుంటే ఏ పంట నిల్వలు ఉంచేందుకు.. లేదా ? వాణిజ్య అవసరాలకు తీసుకున్నారా ? అనే అంశాలను వారు పరిగణలోకి తీసుకోలేదు. మరోవైపు అసలు ఈ గొడౌన్‌లు ఎవరి పేరున నిర్మా ణం అయ్యాయి? అనేది సైతం తెలుసుకోకుండానే కొండను తవ్వి ఎలుకను పట్టామన్న చందంగా వెనుతిరిగారు. జిల్లాస్థాయి అధికార యంత్రాంగం ఇటీవల కాలంలో వెలసిన ఇటువంటి గోడౌన్‌లను పరిశీలిస్తే మరిన్ని అక్రమ నిల్వలు బయటపడే అవకాశం ఉంది. ఆంధ్రజ్యోతి కథనం నేపథ్యంలో ఏడాదిన్నరగా సాగుతున్న బియ్యం అక్రమ రవాణాపై నియోజకవర్గంలో చర్చ సాగుతోంది.

సబ్ కలెక్టర్ దృష్టి సారింపు : నూజివీడు నియోజకవర్గ కేంద్రంగా బియ్యం అక్రమ రవాణాపై 'ఆంధ్రజ్యోతి' కథనం నేపథ్యంలో నూజివీడు సబ్ కలెక్టర్‌గా తొలిసారి బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారిణి వినూత్న తక్షణం దాడులను నిర్వహించాలని ఆదేశిస్తూ పౌరసరఫరాల శాఖనే కాక రెవెన్యూ అధికారులను బృందంలో చేర్చడంతో బియ్యం అక్రమ రవాణాకు సహాయ సహకారాలు అందిస్తున్న కొంతమంది అధికారుల్లో అంతర్మథనం ప్రారంభమైంది. ఇదేరీతిన ముమ్మందు దాడులను నిర్వహిస్తే బియ్యం అక్రమ రవాణాకు పూర్తిగా తెరపడినట్లే.

కుంభవృష్టి

(5వ పేజీ తరువాయి)



లింగపాలెం స్కూల్ ఆవరణలో వరద

ప్రాంతాన్ని సబ్ కలెక్టర్ వినూత్న గురువారం పరిశీలించారు. డ్రెయినేజీలకు అడ్డుపడిన సిల్ట్ తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఉంగు టూరు, భీమడోలు మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్ల పైకి వర్షం నీరు చేరి రోడ్లు చిద్రంగా మారాయి.

అప్రమత్తంగా ఉండాలి : మంత్రి సారథి

భారీవర్షాల కారణంగా ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని, లోతట్టుప్రాంతంలో నివసించే ప్రజలు పట్ల అధికారులు అప్ర మత్తంగా వ్యవహరించాలని, ఏలూరుజిల్లా మంత్రి కె.పార్థసారథి, అధికారులకు స్పష్టం చేశారు. వరద విపత్తును ఎదుర్కొవడానికి ప్రభుత్వ యంత్రాంగం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎంపీ పుట్టా

అల్పపీడనం ప్రభావంతో వచ్చే మూడు రోజులు భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికలు, గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ జారీ, గత అనుభవాలు నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ వద్ద కంట్రోలు రూమ్ నంబర్ 1800-233-1077, 94910 41419లకు లేదా ఎంపీ కార్యాలయ నంబర్లు 96181 94377, 98855 19299 కు ఫోన్ చేయాలని సూచించారు.





ఏలూరులోని కుండీ, చేపల మార్కెట్ సెంటర్లలో గణపతి



పెదవేగిలో కొలువైన మహాగణపతి



బిర్లా భవన్ సెంటర్లో గణపతి

జై..జై.. గణపతి



ఏలూరులో విశేష అలంకరణలో గణపతి

ఊరూవాడ ఘనంగా చవితి వేడుకలు

పలు చోట్ల ఉత్సాహంగా జరిగిన నిమజ్జనాలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు డివిజన్లలో గణేశ్ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. స్వామికి ప్రత్యేక అలంకారాలతో భక్తులకు దర్శనమిచ్చారు. పవరుపేటలోని విజయగణపతి ఆలయం వద్ద ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, మీన దంపతులు ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ ప్రధానార్చకులు కందుకూరి త్రినాథమూర్తి,శబరినంబూరి బాబిలు భక్తులతో పూజలు చేయించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నవుడూరి వాసు, శీర్ల వాసు, వీరవల్లి రామకృష్ణ బృందం భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఎస్ఎంఆర్ నగర్‌లో నగర మేయర్ షేక్ నూర్జహాన్, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవరుపేటలోని విజయ గణపతి స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు.

● ఏలూరు రూరల్: వినాయక చవితి సందర్భంగా ఏలూరు జిల్వా వ్యాప్తంగా వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో భజన మండలి కార్యకర్తలతో వినాయక నామస్మరణతో మార్మోగాయి. వినాయక అష్టోత్తర నామావళి, వినాయక పూజా విశిష్టతను భక్తులు తెలుసుకున్నారు.

● ఏలూరుటూటౌన్: తొలిపూజలందుకునే గణనాధుడి కరుణ లోకమంతా ఉండాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. పవర్‌పేటలో ఉన్న విద్యాగణపతి ఆలయంలో వినాయక చవితి మహోత్సవాల ప్రారంభక్రతువులకు ఎమ్మెల్యే బడేటి చంటి మీనా దంపతులు పాల్గొన్నారు. వందేళ్ల చరిత్ర కలిగి పవర్‌పేటలో ఉన్న శ్రీవిఘ్నేశ్వర ఆలయంలో నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు దంపతులు పూజలు నిర్వహించారు. పండితులు కే.త్రినాథ్‌శర్మ, కే.విజయ్, జే.శబరీష్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వాసు, చీర్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: కామవరపు కోటలోని గుర్రాల చెరువు గట్టు వద్ద ఉన్న శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద శ్రీలలితా పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గకుమారాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● ద్వారకాతిరుమల/పెదవేగి: వినాయక చవితి వేడుకలు ద్వారకాతిరుమల, పెదవేగి మండలంలో ఘనంగా జరిగాయి. దాదాపు అన్ని ప్రదానకూడళ్లలోనూ భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటుచేశారు. ద్వారకాతిరుమల లక్ష్మీపురం ఆలయం వద్ద వేడుకలను అట్టహసంగా నిర్వహించారు. అలాగే వినాయక నిమజ్జనాన్ని నృశింహసాగరంలో గురువారం నిర్వహించారు.

● బుట్టాయగూడెం: రెడ్డిగణపవరం గీతా మందిరం వద్ద మండపాన్ని ఏర్పాటు చేసి గణపతి విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామికి పూజలు నిర్వహించారు.

● ఉంగుటూరు: నారాయణపురం వర్తక సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ తరపున అడపా శ్రీను నేతృత్వంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మండపాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● పోలవరం: మండలంలోని అన్ని గ్రామాల కూడళ్లలో గణపతి ప్రతిమలను ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తావులేకుండా పోలీసులు పెర్రీరేవుల వద్ద గస్తీ నిర్వహిస్తున్నారు. పట్టిసీమ లక్ష్మీగణపతి ఆలయం వద్ద ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు పూజలు నిర్వహించారు. నునకాని రాంబాబు, సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



ద్వారకాతిరుమలలో నిమజ్జనానికి వెళ్తున్న గణపతి

● జీలుగుమిల్లి: స్థానిక సీఆర్‌ఆర్ కాలనీలో గణనాథుడి విగ్రహం ఏర్పాటు చేశారు. అర్చకులు కె.చిరంజీవి శర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్నారు. పూజల్లో స్థానికులు, యూత్ సభ్యులు పాల్గొని భక్తి శ్రద్ధలతో గణేశ్ భజనలు చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు తమ సిబ్బందితో పర్యవేక్షించినట్టు ఎస్.ఐ. వి.క్రాంతికుమార్ తెలిపారు.

● చింతలపూడి: చవితి వేడుకలను పురస్కరించుకుని మండలంలో 119 మండపాలు ఏర్పాటు చేశారు. సంప్రదాయబద్ధంగా ఆయా మండలాల్లో పూజలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఉచిత విద్యుత్ ఇవ్వడంతో నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● టి.నర్సాపురం: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో శ్రీవరసిద్ధి వినాయక స్వామికి 50కేజీల ప్రసాదాన్ని దారవత్తు కృష్ణ, అంజలి దంపతులు సమర్పించారు. బండివారిగూడెంలో రామాలయ కమిటీ ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు.

నిమజ్జనాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి

ఏలూరు క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల నిమజ్జనాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని కమిటీలకు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ సూచించారు. ఏలూరు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులకు సూచనలు చేశారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. సమయ పాలన పాటించి నిమజ్జనాలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిమజ్జన సమయాల్లో మందు తాగవద్దని అన్నారు. విగ్రహాలు తీసుకువెళ్ళే వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎత్తైన విగ్రహాలు తరలించే సమయంలో విద్యుత్ తీగలకు తగులకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నదులు, చెరువుల్లో నిమజ్జనం చేసే ముందు పర్యావరణానికి హాని కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏమైనా ఇబ్బందులు సంభవిస్తే 112కు సమాచారం అందించాలన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

పెదవేగి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రజలకు సూచించారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తమ్మిలేరు, రామిలేరు. గుండేరు వంటి పరివాహక ప్రాంతాల్లో అధికారులు ఎల్లవేళలా అప్రమత్తమంగా ఉండాలన్నారు. మండల స్థాయి అధికారుల నిరంతరాయ పర్యవేక్షణలో గ్రామ స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు.

విద్యుత్ స్తంభాలు ముట్టుకోవద్దు : రోషన్

ఏలూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని లింగపాలెంలో ఆయన గ్రామస్థులతో మాట్లాడారు. చెరువులు, వాగులు, కాలువల్లోకి దిగవద్దని, తడిచిన విద్యుత్ స్థంబాలను తాకకూడదని ప్రజలకు సూచించారు. తమ్మిలేరులోకి వరదనీటి ప్రవాహం అధికంగా వస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తం ఉండాలన్నారు.

బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన

ఏలూరు క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ గురువారం అమీనాపేటలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపైన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు.బాల్య వివాహాలు ఇష్టంలేని బాల బాలికలను ప్రభుత్వం వసతి గృహాల్లో పునరావాసం కల్పించి విద్యా సౌకర్యాలు ఏర్పాటు చేస్తారని, అవసరమైన బాలబాలికలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ప్యానల్ న్యాయవాది పి వెంకటేశ్వరరావు, వసతి గృహ వార్డెన్ రాధాదేవి తదితరులు పాల్గొన్నారు.



పుట్టిన రోజు వేడుక నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా బిషప్ జయరావు జన్మదిన వేడుక

పెదవేగి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఏలూరు పీఠాధిపతి, సెయింట్ జోసెఫ్ దంతవైద్య కళాశాల చైర్మన్ బిషప్ జయరావు పొలిమేర 60వ జన్మదిన వేడుకలు దంతవైద్య కళాశాల ఆవరణలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆటపాటల నడుమ జయరావు కేక్‌కట్ చేసి, జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. బాంబే ఎమిరేట్స్ ఆర్చ్ బిషప్ ఓస్వాల్డ్ కార్డినల్ గ్రేసియస్ ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన సీనియర్ అడ్వకేట్ జవాక్కిమ్ ఎఫ్ రెషి, ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ పి.బాల, కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, ఛాన్సలర్ ఫాదర్ ఇమ్మానియేల్, ఏలూరు పీఠం కోశాధికారి ఫాదర్ బి.రాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్లీవరాజు పాల్గొన్నారు.

సీఎంతో కరాటం భేటీ

కొయ్యలగూడెం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడ్ని జనసేననేత కరాటం రాంబాబు భేటీ అయ్యారు. ఈ మేరకు గురువారం సాయంత్రం 5గంటలకు ముఖ్యమంత్రి కార్యాలయంలో సమావేశమయ్యారు. సుమారు అరగంట సేపు జిల్లా రాజకీయాల పైన, పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల రాజకీయా పరిణామాలపై చర్చించుకున్నట్లు తెలిసింది. మాజీ మంత్రి దేవినేని ఉమా, కరాటం రాంబాబు ఇటీవల ఫోన్ సంభాషణ రాష్ట్రంలో చర్చనీయాంశమైంది. దీనిపై కూడా సీఎం చర్చ జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. సీఎం ఆఫీసు నుంచి ఫోన్ రావడంతో గురువారం వెళ్లి సీఎంను కలిశానన్నారు. ఆర్అండ్ఆర్, పోలవరం ప్రాజెక్టు పైన మాట్లాడినట్లు తెలిపారు. అయితే ఈ భేటీలో ఏ చర్చ జరిగిందోనని జిల్లా వ్యాప్తంగా ఉత్కంఠ ఉంది.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చంటి, మేయర్

నగరంలో శంకుస్థాపనలు

ఏలూరుటూటౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన్నట్టు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు.నగరంలో 28, 49 డివిజన్ పరిధిలో రూ. కోటి 60 లక్షలతో నిర్మించబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్‌లు శంకుస్థాపన చేశారు. డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని, కార్పొరేటర్లు తంగిరాల అరుణసురేశ్, దేవరకొండ శ్రీనివాస్, నెరుసు రంగరాజు, ఏఎంసీచైర్మన్ పార్థసారధి, నగర టీడీపీ అధ్యక్షుడు చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

ఆలయ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక శనివారపుపేటలోని ఏటిగట్టు వద్ద ఉన్న నల్లబసవలింగం సత్రం(రామాలయం) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని గురువారం సత్రం ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ట్రస్టు బోర్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సత్రం చైర్మన్‌గా దోనేపూడి లోవరాజు, డైరెక్టర్లుగా సీరావు సత్యనారాయణ, దేవరపల్లి రత్నబాబు, తాడివలస పవనకుమార్, జువ్వలగుంట తులసి, కె.దుర్గ, పి.వెంకటలక్ష్మీభవాని, కిల్లి సరస్వతి, ఎన్.వి.సత్యనారాయణలతో ప్రమాణ స్వీకారం చేయించారు.

కాగుపాడు ఆలయ కమిటీ..

ఉంగుటూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కాగుపాడు గ్రామంలోని బాలగోపాల స్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. అధ్యక్షుడిగా కడియాల రంగారావు, వైస్ చైర్మన్‌గా కడియాల రామచంద్రరావు, సభ్యులుగా వాణి వెంకట లక్ష్మి, దుక్కా కళావతి, గోపవరపు కృష్ణ వేణి, అద్దంకి పెద్దిరాజు, దుక్కా రామకృష్ణ, భీమవరపు రాజేశ్వరి చేత ఆలయ కార్య నిర్వహణాధికారి కలగర శ్రీనివాస్ ప్రమాణం చేయించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మండల టి.డి.పి.అధ్యక్షులు వేములపల్లి సుధీర్, చేబ్రోలు సొసైటీ అధ్యక్షులు కడియాల రవిశంకర్, ఇమ్మణ్ణి గంగాధరరావు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేదు

భీమడోలు, ఆగస్టు 27(ఆంధ్రజ్యోతి): భీమడోలు మండలంలో ఎరువుల కొరత లేదని ప్రస్తుతం దుకాణాలు, సొసైటీల్లో 72 ఉన్నాయి. యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయ శాఖ జేడీ హబీబ్ పాషా అన్నారు. మండలంలోని గుండుగొలనులోని అంబికా, స్వర్ణఫెర్టిలైజర్స్ ఎరువుల దుకాణాల్లో గురువారం జేడీ తనిఖీలు నిర్వహించారు.ప్రైవేటు డీలర్స్, సొసైటీల్లో యూరియా కొరత లేదన్నారు. రైతులు అవసరం మేరకే ఎరువులు తీసుకోవాలన్నారు. ఏవో ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో 23 మెట్రిక్ టన్నులు..

జీలుగుమిల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం పలు ఎరువుల షాపులు సొసైటీల్లో సుమారు 23మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్టు మండల వ్యవసాయాధికారి కె. గంగాధరం తెలిపారు. జీలుగుమిల్లి సొసైటీలో 12.5, ములగలంపల్లి సొసైటీలో 2.5, ఆర్.కె.ట్రేడర్స్‌లో 8 టన్నులు ఉన్నట్లు రైతులు వినియోగించుకోవాలన్నారు. దీంతో పాటు సొసైటీల్లో ప్రవేటు షాపుల్లో ఉన్న



స్టాకు రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

నానో యూరియాను ప్రత్యామ్నయంగా వాడుకోవాలన్నారు. యూరియాకు బదులుగా అమ్మోనియా సల్ఫేట్ 3ఎకరాలకు ఒక బస్తా వాడుకోవచ్చన్నారు.

నానో ఎరువులు వాడండి..

ఏలూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలను తీర్చడానికే పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు లింగపాలెం మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్ కుమార్ అన్నారు. రంగాపురం, భోగోలు గ్రామాల్లో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని, సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉన్న నానో ఎరువులను వాడాలన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన

చింతలపూడి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బషీర్‌బాగ్ పోరాట స్ఫూర్తితో విద్యుత్ సంస్కరణకు వ్యతిరేకంగా పోరాడాలని వామపక్షాలు పిలుపునిచ్చాయి. సీపీఐ కార్యాలయంలో విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ దినం గురువారం నిర్వహించారు. మండల కార్యదర్శి టి.బాబు, పాం దురంగారావు, ఆర్.వి.సత్యనారా యణ, డి.సత్యనారాయణ, కంచర్ల గురవయ్య, డి.కృష్ణ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం బస్టాండ్ వద్ద..

బుట్టాయగూడెం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై పోరాడాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రం బస్టాండ్ ఎదుట నిరసన తెలిపారు. నాయకులు కారం రాఘవ, తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, తగరం బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బి.వినోద్, జి.పండు, డి.గంగరాజు, కె.రవి, కె.సోమరాజు, పి.పేతురు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

ఏలూరు అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై గురువారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సీఆర్‌ఆర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సెట్‌వెల్ జిల్లా అధికారి ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు మాట్లాడుతూ యువత ప్రభుత్వ స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జితేంద్ర, జిల్లా ఉపాధి కల్పనాధికారిణి వరలక్ష్మి, మేరా యువభారత్ అధికారి రాము పాల్గొన్నారు.

ఆదికర్మయోగి అభియాన్‌పై..

బుట్టాయగూడెం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఆది కర్మయోగి అభియాన్ పథకం అమలులో భాగంగా మండల స్థాయి అధికారులకు, సచివాలయం సిబ్బందికి జడ్‌పి హైస్కూల్లో గురువారం ఎంపీడీవో కె.జ్యోతి అవగాహన కల్పించారు. 29వ తేదీన కూడా కార్యక్రమం జరుగుతుందని అధికారులు, సచివాలయం ఉద్యోగులు తప్పకుండా హాజరు కావాలన్నారు. ఐటీడీఏ, డీఎంటీ, బీఎంటీ, డిప్యూటీ ఎంపీడీవో, మెడికల్, ఐసీడీఎస్ ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరంలో శిక్షణ..

పోలవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మండల ప్రజా పరిషత్ అధికారి చెరుకూరి శ్రీనివాస్‌బాబు ఆధ్వర్యంలో ఆదికర్మ యోగి, దర్తి ఆబ జన్‌జాతీయ ఉత్కర్ష్ అభియాన్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో శ్రీనివాస్ బాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి ఏజెన్సీ పర్యటన వాయిదా?

బుట్టాయగూడెం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీలో జరగాల్సిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జతోతు హుస్సేన్ పర్యటన వాయిదా పడింది. వాస్తవంగా ఆయన సెప్టెంబరు 1,2తేదీల్లో ఏజెన్సీలో పర్యటించాల్సి ఉంది. సెప్టెంబరు 1న కమిషన్ సభ్యుడు బుట్టాయగూడెం-వేలేరుపాడు మండలాల సరిహద్దులోని దట్టమైన అటవీ ప్రాంతంలో పాపికొండల సమీపంలో ఉన్న కొండరెడ్డి గ్రామం మోదేలును సందర్శించి అక్కడ కొండరెడ్లతో మాట్లాడాల్సి ఉంది. వర్షాలు కురుస్తున్నందున మోదేలు వెళ్లడానికి ఎటువంటి అవకాశం లేకపోవడంతో పర్యటన వాయిదా పడినట్టు తెలిసింది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే సెప్టెంబరు 25న తర్వాత ఆయన ఏజెన్సీలో పర్యటిస్తారని సమాచారం.

ముక్కంపాడుకు రోడ్డు వేయండి

చింతలపూడి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రగడవరం మేజర్ పంచాయతీ శివారు ముక్కంపాడు గ్రామానికి రోడ్డు వేయాలని ఆ గ్రామానికి చెందిన కొందరు యువకులు ఎమ్మెల్యే రోషన్ కుమార్‌కు విన్నవించారు. ముక్కంపాడు- ప్రగడవరం మధ్య కిలోమీటరు దూరం ఉంటుంది. ఏమాత్రం వర్షం వచ్చినా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఉంగుటూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నిడమర్రు సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు బాదంపూడి రూరల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఈ.ఈ.కే.ఎం.అంబేద్కర్ తెలిపారు. రావులపర్రు, సీతారాంపురం, రాచూరు గ్రామాల చేపల చెర్వులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.



బ్యాటరీ కారు విరాళం

ద్వారకాతిరుమల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయానికి వచ్చే వృద్ధులు, వికలాంగులు సౌకర్యార్థం స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ఆధ్వర్యంలో రూ.6 లక్షల విలువైన బ్యాటరీ కారును గురువారం విరాళంగా దేవస్థానానికి అందజేశారు. కారును ఎస్బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్(బీఅండ్‌వో) సీతాక్షి సింగ్ ఆలయానికి వచ్చి దేవస్థానం ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తికి అందజేశారు. ఆలయానికి వచ్చిన ఎస్బీఐ అధికారులు సీతాక్షిసింగ్, ప్రాంతీయ మేనేజర్ ఏలూరు పి.కాళిదాసు, స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ పండితుల నుంచి వేదాశీర్వచనం పొందారు. వీరికి ఆలయ ఈవో మూర్తి శ్రీవారు, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

గిరిజన చట్టాలను అమలు చేయాలి

జీలుగుమిల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో గిరిజనేతరుల అక్రమ కట్టడాలను తొలగించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు కొమరం వెంకటేశ్వరావు అన్నారు. గిరిజన చట్టాన్ని పటిష్టంగా అమలు చెయ్యాలని, గిరిజనేతర అక్రమ కట్టాడాలు తొలగించాలని తహసీల్దారు కార్యాలయంలో డీటీ ఎస్.వి.రమణకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ రూరల్ డవలప్‌మెంట్ అధికారులు ఏజెన్సీ చట్టాల్ని పటిష్టంగా అమలు చెయ్యాలని కోరారు. కార్యదర్శి కుంజా కృష్ణంరాజు, తులసీరామ్ ఉన్నారు.

ఉన్నత పదవులు అధిరోహించాలి

ఏలూరుటూటౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేదలకు అపన్నహస్తం అందించే బిషప్ జయరావు పొలిమేర మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని గౌరీపట్నం అన్నదాన ట్రస్ట్ కాంట్రాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. బిషప్ జయరావు పొలిమేర పుట్టినరోజును పురస్కరించుకుని బిషప్ హౌస్‌లో బిషప్ జయరావును ఘనంగా సన్మానించారు.

ఆంధ్రజ్యోతి
నూజివీడు
నూజివీడు, కైకలూరు
7 www.andhrajyothy.com ● శుక్రవారం 29 ఆగస్టు 2025

అధికారులు పనితీరు మెరుగుపర్చుకోవాలి : సబ్ కలెక్టర్

ఆగిరిపల్లి, ఆగస్టు 28, (ఆంధ్రజ్యోతి) : అధికారులు తమ పనితీరు మెరుగుపర్చుకోవాలని, శాఖ ప్రతిష్ఠను పెంచేందుకు బాధ్యతాయుతంగా కృషి చేయాలని సబ్ కలెక్టర్ బి.వినూత్న అన్నారు. గురువారం మండల రెవెన్యూ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. అభివృద్ధి, పరిపాలనపరమైన అంశాలపై మాట్లాడారు. గణేష్ నిమజ్జనంపై పలు సూచనలు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. సమావేశంలో తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్, ఎంపీడీవో భార్గవి, అధికారులు పాల్గొన్నారు.

నేడు కైకలూరులో మెగా జాబ్‌మేళా

కైకలూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కైకలూరులో శుక్రవారం నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సూచించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో నిర్వహిస్తున్నామన్నారు. జాబ్‌మేళాలో పది కంపెనీలకుపైగా ప్రతినిధులు పాల్గొంటారని 700 మందికి ఉద్యోగాలు అందిస్తారన్నారు. విద్యార్హతలతో పాటు 18నుంచి 30 ఏళ్ల వయస్సు గల వారు బయోడేటా, సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

ప్రజా సమస్యలపై మంత్రి ప్రత్యేక దృష్టి

» వారంపాటు ప్రత్యేక డ్రైవ్.. అధికారుల నియామకం

నూజివీడు,ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):నూజివీడు పట్టణంలో ప్రజా సమస్యలపై మంత్రి కొలుసు పార్థసారధి ప్రత్యేక దృష్టిసారించారు. వారం రోజులపాటు ప్రతివార్డుకి ఇద్దరు అధికారులను నియమించి, వార్డు సమస్యలు పరిష్కారానికి కృషిచేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. ముఖ్యంగా పట్టణంలో పారిశుధ్యం, తాగునీరు, వార్డుల్లో ఉన్న సమస్యలను ఆ వార్డుకి నియమించిన అధికారికి ప్రజలు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ప్రజాసమస్యలను అధికారులు పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. వార్డు అధికారులుగా తన పేషీలోని సిబ్బందిని సైతం నియమించడం విశేషం.

- 1,7,13,19,25,31వ వార్డులకు డాక్టర్ ఎన్.ప్రకాశరావు, పీఏ: 99631 11548.
- 2,8,14,20,26వ వార్డులకు డాక్టర్ జి.అనిత, మంత్రి అడిషనల్ పీఏ : 94408 48413, పి.వినోద్, మంత్రి పేషీ అధికారి : 91821 14263.
- 3,9,15,21,27వ వార్డులకు పి.రమేష్, పీఏ : 94911 98814.
- 4,10,16,22,28వ వార్డులకు సీహెచ్ వెంకటేశ్వర్లు, పీఏ:80147 19999
- 5,11,17,23,29వ వార్డులకు వి.రాహుల్, మంత్రి సోషల్ మీడియా అసిస్టెంట్ : 94901 27740.
- 6,12,18,24,30,32 వార్డులకు గణేష్, లోకల్ పీఏ: 85220 07645కు కేటాయించారు

14న హిందూ న్యాయవాదుల ధర్మసమ్మేళనం


ధర్మసమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న శివస్వామిజీ, తదితరులు

కైకలూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): హిందూ న్యాయవా దుల ధర్మ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని శైవక్షేత్ర పీఠాధిప తులు ధర్మోరక్షిత రక్షిత ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీశివ స్వామిజీ అన్నారు. గురువారం కైకలూరు రామకృష్ణ సేవాసమితిలో వచ్చే నెల 14వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే హిందూ న్యాయవాదుల ధర్మసమ్మేళనం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాల ఆస్తులను పరిరక్షించి దీప ధూపనైవేద్యాలకు అర్చకులకు, పీఠాధిపతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయాలనే సంకల్పంతో ముందుకు వెళుతున్నా మన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 150 బార్ అసోసియేషన్లు ఉన్నాయని ఒక్కొక్క బార్ అసోసియేషన్ నుంచి పదిమంది హిందూ న్యాయవాదులు సమావేశంలో పాల్గొంటారన్నారు. ప్రధానంగా ఆలయాల ఆస్తుల పరిరక్షణ చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో అడ్వకేట్ జి.కృష్ణకుమార్, కైకలూరు న్యాయవా దులు మేడిశెట్టి పాములు, కట్టా శ్రీనివాసరావు, రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు భూపతిరాజు వెంకటేశ్వరవర్మ, సభ్యుడు రాజేశ్వరరావు పాల్గొన్నారు.

సక్రమమా?.. అక్రమమా ?

(5వ పేజీ తరువాయి)

చేయడానికి అధికార యంత్రాంగంలోని కొందరు అధికారులు, ఇతర పెద్దలు సహకారం లేకుండా చేయడం అసాధ్యమనే గుసగుసలు విన్పిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంత బహిరంగంగా అక్రమ బియ్యం వ్యాపారానికి తెగబడడం నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశమైంది. 2వ తేదీ నాటికే అనేక గ్రామాల్లో రేషన్ షాపుల వద్ద బియ్యం అయిపోయాయని సమాధానం వస్తున్నట్టు పలువురు కార్డుదారులు పేర్కొంటున్నారు.

తనిఖీలు సరే.. అనుమతుల ఊసేది

మామిడి తోటల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణాను ప్రస్తావిస్తూ 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 21వ తేదీన 'మామిడి తోటలో.. రేషన్ బియ్యం దందా!' శీర్షికన ప్రచురితమైన కథనం సంచలనం రేపింది. దీంతో గత గురువారం నూజివీడు పౌరసరఫరాల డీడీతో పాటు ఏలూరు, ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని ఇతర పౌర సరఫరాల శాఖ అధికారులు బృందంగా ఏర్పడి ఆగిరిపల్లి మండలంలో వరుస తనిఖీలను నిర్వహించారు. శోభనాపురం పరిధిలోని మామిడితోటలో పౌరసరఫరాల శాఖ గొడౌన్‌ను మించి దాదాపు వంద లారీలకు పైబడి (10 వేల నుంచి 20 వేల టన్నుల) సామర్థ్యం గల ప్రైవేట్ గొడౌన్లు దర్శనమిచ్చాయి. అయితే అధికారులు అక్కడ ఎటువంటి బియ్యం నిల్వలు లేవని తేల్చారే కాని, సీఆర్‌డీఏ పరిధిలోని శోభనాపురంలో నిర్మించిన ఈ గొడౌన్‌లకు అనుమతులు ఉన్నాయా? అను మతులు తీసుకుంటే ఏ పంట నిల్వలు ఉంచేందుకు.. లేదా ? వాణిజ్య అవసరాలకు తీసుకున్నారా ? అనే అంశాలను వారు పరిగణలోకి తీసుకోలేదు. మరోవైపు అసలు ఈ గొడౌన్‌లు ఎవరి పేరున నిర్మా ణం అయ్యాయి? అనేది సైతం తెలుసుకోకుండానే కొండను తవ్వి ఎలుకను పట్టామన్న చందంగా వెనుతిరిగారు. జిల్లాస్థాయి అధికార యంత్రాంగం ఇటీవల కాలంలో వెలసిన ఇటువంటి గోడౌన్‌లను పరిశీలిస్తే మరిన్ని అక్రమ నిల్వలు బయటపడే అవకాశం ఉంది. ఆంధ్రజ్యోతి కథనం నేపథ్యంలో ఏడాదిన్నరగా సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నియోజకవర్గంలో చర్చ సాగుతోంది.

సబ్ కలెక్టర్ దృష్టి సారింపు

నూజివీడు నియోజకవర్గ కేంద్రంగా బియ్యం అక్రమ రవాణాపై 'ఆంధ్రజ్యోతి' కథనం నేపథ్యంలో నూజివీడు సబ్ కలెక్టర్‌గా తొలిసారి బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారిణి వినూత్న తక్షణం దాడులను నిర్వహించాలని ఆదేశిస్తూ పౌరసరఫరాల శాఖనే కాక రెవెన్యూ అధికారులను బృందంలో చేర్చడంతో బియ్యం అక్రమ రవాణాకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్న కొంత మంది అధికారుల్లో అంతర్మథనం ప్రారంభమైంది. ఇదేరీతిన ముున్ముందు దాడులను నిర్వహిస్తే బియ్యం అక్రమ రవాణాకు పూర్తిగా తెరపడినట్లే.


కైకలూరులో ఆది వినాయక స్వామి భారీ విగ్రహం


ముదినేపల్లిలో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న ఎస్‌ఐ వీరభద్రరావు, భక్తులు


కలిదిండిలో గణనాథుడి విగ్రహం వద్ద భక్తుల పూజలు


నూజివీడు మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉన్న గణనాథునికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

జై గణేశ్..

» భక్తిశ్రద్ధలతో వాడవాడలా వినాయక చవితి పూజలు
» మండపాల్లో కొలువుతీరిన గణనాథుల విగ్రహాలు

వినాయక చవితి పూజలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వినాయకుడి ఆలయాల వద్ద మండపాల్లో గణనాథులు కొలువుతీరారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణనాథుడికి పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రెండో రోజు గురువారం గణనాథుల ప్రతిమల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కైకలూరు/ముదినేపల్లి/కలిదిండి,ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కైకలూరు మండలంలో వినాయకచవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో భారీ వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. కైకలూరులో కూరగాయల, పండ్లవర్తక సంఘం ఆధ్వర్యంలో 51వ వార్షికోత్సవంలో ఆది వినాయక స్వామి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. ఆటపాకలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముదినేపల్లి మండలంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన 80 మండపాల్లో గణనాథుల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. ముదినేపల్లి వై.జంక్షన్‌లో గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో ఎస్‌ఐ వి.ఎస్. వీరభద్రరావు, పోలీసు సిబ్బంది, బీసీ సంక్షేమ సంఘం నాయకుడు శౌంఠి కుమారస్వామి తదితరులు పూజలు జరిపారు. పెదగొన్నూరులో శాలి వాహన సంఘం ఆధ్వర్యంలో వినాయకుడి దేవస్థానంలో గణేష్ నవరాత్రుల ఉత్సవాలు జరుగుతున్నాయి. కలిదిండి మండలం కలిదిండి సెంటరులో ఏర్పాటు చేసిన 12 అడుగుల వినాయక విగ్రహానికి భక్తులు పూజలు నిర్వహించారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్ ఎం. మారుతి ప్రసన్న, ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొరిపర్తి సుబ్బారావు, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, బొయిన గోవింద్, మేకా భోగేశ్వరరావు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావులు పాల్గొన్నారు.

నూజివీడు నియోజకవర్గంలో..

నూజివీడు టౌన్/ముసునూరు/చాట్రాయి/ఆగిరిపల్లి : నూజివీడు పట్టణ, మండల ప్రాంతాల్లో పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమల వద్ద పూజలు నిర్వహించారు. వేద పండితులు గణనాథునికి వేద మంత్రం మధ్య ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. నూజివీడులో మంత్రి కొలుసు పార్థసారథి క్యాంపు కార్యాలయంలోనూ గణేష్ విగ్రహాన్ని నెలకొల్పి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ముసునూరు మండల పరిధిలో సుమారు 80కిపైగా గణేష్ ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. ముసునూరు బీసీ కాలనీలో మహాగణపతి, పడమట రామాలయంలో శాంతి గణపతి, రావిచెట్టు సెంటర్‌లో బొజ్జ గణపతికి పూజలు చేశారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌ఐ ఎం.చిరంజీవి, సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. చాట్రాయి మండలంలో వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. విద్యార్థులు, వ్యాపారులు చేతి వృత్తుల వారు తమ పుస్తకాలు, పనిముట్లను స్వామి వారి మందు ఉంచి పూజలు చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఆరుగొలనుపేటలలో టీడీపీ మండల అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు దంపతులు గణనాథుడికి పూజలు చేశారు. కోటపాడు పాత రామాలయంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహానికి గ్రామస్థులు పూజలు చేశారు. చాట్రాయి రామాలయం వద్ద జనసేన నాయకులు 216 వినాయకుడి మట్టి ప్రతిమలను ప్రజలకు పంపిణీ చేశారు. జనసేన నాయకులు నవరం రామారావు, కొల్లా శ్రీకాంత్, పసుపులేటి రంగారావు, పి.మహేష్, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు. ఆగిరిపల్లి మండలంలోని పలు గ్రామాలలో విభిన్న రూపాలలో వినాయకుడి విగ్రహాలు, ప్రతిమలను ఊరేగింపుతో తీసుకొచ్చి మండపాల్లో ప్రతిష్ఠించి పూజలు చేశారు.


ముసునూరు బీసీ కాలనీలో మహాగణపతి


కోటపాడు పాత రామాలయంలో వినాయకుడు


యల్లాపురం మైనర్ కాలువలో పూడిక తీస్తున్న దృశ్యం

గోగులంపాడుకు చేరిన సాగర్ జలాలు

మైనర్ కాలువలను శుభ్రం చేస్తున్న రైతులు, నాయకులు

ముసునూరు,ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వేంపాడు మేజర్ ద్వారా చివరి భూములకు నీరు అందించేందుకు నాయకులు, అధికారుల పర్యవేక్షణలో గురువారం గోగులంపాడుకు సాగర్ జాలాలు చేరుకున్నాయి. చెరువులకు నీరు వెళ్లే మైనర్ కాలువలను డీసీ ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ, ఏఈ వీరబ్రహ్మం ఆధ్వర్యంలో రైతులు, టీడీపీ నాయకులు సహకారంతో శుభ్రం చేస్తున్నారు. యల్లాపురం మైనర్ కాలువలో పూడిక మట్టిని, చెత్త చెదారాన్ని నాయకులు పొన్నగంటి వేణు, కాటేపల్లి కేశవరావు ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించి లోపూడిలో కొత్తచెరువుకు నీరును తరలిస్తున్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ వేంపాడు మేజర్ కాలువకు 550 క్యూసెక్కుల సాగర్ జలాలు వస్తున్నాయని, ఈ నీటిని వేంపాడు చివరి వరకు తీసుకువెళ్లాలని అధికారులు, నాయకులు సంయుక్తంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

అడుగంటిన చెరువులకు తాగునీరు విడుదల

కలిదిండి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): లంక గ్రామాల్లో అడుగంటిన తాగునీటి చెరువులను నింపేందుకు కోరుకొల్లు లాకుల వద్ద గురువారం సీబీ కెనాల్‌కు తాగునీరు విడుదల చేశామని ఇరిగేషన్ ఏఈఈ ఫణికుమార్ తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 18న ప్రచురితమైన 'బురదనీరే... తాగునీరు' శీర్షికన కథనానికి అధికారులు స్పందించారు. పెద లంక, మూల్లంక, భాస్కరావుపేట, మట్ట గుంట, కొండంగి, సంతోషపురం గ్రామాల్లో తాగునీటి చెరువును పూర్తిగా నింపేవరకు తాగునీటి వంతు ఇస్తామన్నారు. తాజా నీటితో తాగునీటి చెరువులకు నింపటానికి సర్పంచ్‌లు, కార్యదర్శులు సహకరించాలన్నారు.

పర్వతాపురం మాజీ సర్పంచ్ కోటేశ్వరమ్మ మృతి


కోటేశ్వరమ్మ(ఫైల్)

చాట్రాయి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పర్వతాపురం గ్రామ మాజీ సర్పంచ్ మిద్దె కోటేశ్వరమ్మ(67) అనారోగ్యంతో గురువారం కన్ను మూశారు. కిడ్నీ సమస్యతో విజయవాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మామయ్య తిరుపతి వెంకయ్య, భర్త సత్యనారాయణ, మరిది బాలకృష్ణ గతంలో సర్పంచ్‌లుగా పనిచేయగా, ప్రస్తుతం కుమారుడు శివరామకృష్ణ సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు పార్టీల నాయకులు ఆమె భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టీడీపీ నాయకుడు ఉదయ్ భాస్కర్ మృతి


ఉదయ్ భాస్కర్ (ఫైల్)

ముసునూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వలసపల్లి గ్రామ సర్పంచ్ తనయుడు, టీడీపీ నాయకుడు చలసాని ఉదయ్‌భాస్కర్(44) అనారోగ్యంతో బుధవారం సాయంత్రం మృతి చెందారు. కొన్ని నెలలుగా ఆయన గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రితో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. గురువారం అతని భౌతికకాయాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, సొసైటీ అధ్యక్షుడు కొల్లి కృష్ణయ్య, గుడిపాడు టీడీపీ అధ్యక్షుడు మందలపు ధర్మరాజు, సీనియర్ నాయకులు కొల్లి గంగారామ్, స్థానిక నాయకులు సందర్శించి, నివాళులర్పించారు.

నలుగురు జూదరుల అరెస్ట్

చాట్రాయి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చాట్రాయి శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం సాయంత్రం దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.1,04,600 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. కుటుంబాలను ఆర్థికంగా దెబ్బతీస్తున్న జూదక్రీడను ఎవరైనా ప్రోత్సహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో జరిగే జూదక్రీడలపై పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

'విద్యుత్ అమరవీరుల ఆశయ సాధనకు పోరాడతాం'

నూజివీడు టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పోలీస్ కాల్పులలో మరణించిన విద్యుత్ అమరవీరుల ఆశయ సాధనకు పోరాడతామని వామపక్ష నాయకులు అన్నారు. ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా 2000లో విద్యుత్ చార్జీలు పెంచిన చంద్రబాబు ప్రభుత్వం వైఖరికి నిరసనగా వామపక్షాలు, కాంగ్రెస్ ఇచ్చిన పిలుపులో భాగంగా హైదరాబాద్ జరిగిన మారణ కాండలో పోలీస్ కాల్పులలో మరణించిన అమరులు రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వాములకు వామపక్ష నాయకులు నివాళులర్పించారు. నూజివీడు చిన్న గాంధీ బొమ్మసెంటర్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట్రామారావు మాట్లాడుతూ అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలపై ప్రజలు వ్యతిరేకించి పోరాటం నిర్వహిస్తే మారణ కాండకు పాల్పడి ముగ్గురు ప్రాణాలు కోల్పోగా వందల మంది గాయపడ్డారని అన్నారు. దాని నుంచి గుణపాఠం తీసుకుని చంద్రబాబు 25 ఏళ్ల తరువాత మళ్లీ ట్రూఅప్ చార్జీలు రద్దు చేస్తానని, స్మార్ట్ మీటర్లు వద్దని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై విద్యుత్ బారాలు మోపడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, సీపీఎం ఎంఎల్ లిబరేషన్ నాయకులు బుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

● ముసునూరు : విద్యుత్ చార్జీలు పెంపు, స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపుదలను వ్యతిరేకిస్తూ గురువారం ముసునూరులో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. దీనికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు అర్పించిన కామ్రేడ్స్‌కి నివాళులు అర్పించారు. నిరసనలో నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఈదులగూడెం పీఏసీఎస్ ఛైర్మన్ శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం

ఆగిరిపల్లి,ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : ఈదులగూడెం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. ఛైర్మన్‌గా ఈలప్రోలు శ్రీనివాసరావు, సభ్యులుగా గుంటూరు శ్రీనివాసరావు, గూడవల్లి కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు చేపట్టారు. ఛైర్మన్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథికి కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, చిట్నేని శివ రామకృష్ణ, కొల్లిపర సాంబశివరావు, ఆరేపల్లి శివయ్య, చిట్నేని శేషగిరిరావు, పాల్గొన్నారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

ముదినేపల్లి,ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చేపల చెరువు వద్ద ఒంటరిగా ఉన్న ఒక మహిళ పట్ల ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించి, వేధించిన ఘటన వెలుగులోకి వచ్చింది. ముదినేపల్లి ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపిన వివరాలివి.. మండలంలోని బొమ్మినంపాడు శివారు రామచంద్రపురం గ్రామానికి చెందిన ఓ మహిళ తమ పొలాన్ని ఆరేళ్ల క్రితం చేపల చెరువు తవ్వకానికి ఈడేపల్లికి చెందిన బి. నాగబాబుకు లీజుకు ఇచ్చింది. లీజు సాకుతో అతడు తరచూ ఆ మహిళ ఇంటికి వెళ్లి అసభ్యంగా వేధించేవాడు. ఈ విషయం ఆమె గ్రామ పెద్దలకు చెప్పగా చెరువు లీజు రద్దు చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 23న ఆ మహిళ తన చెరువు వద్దకు వెళ్లగా అతడు అక్కడికి వచ్చి చుట్టుపక్కల ఎవరూ లేక పోవడంలో ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించగా మెడలోని బంగారపు నానుతాడు తెగిపడింది. ఆమె కేకలు వేయడంతో నిందితుడు పారిపోయాడు. దీనిపై గ్రామ పెద్దలకు చెప్పగా న్యాయం జరగలేదని ఈనెల 27న ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.


మొగల్ చెరువు ప్రాంతంలో పరిస్థితి పరిశీలించి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న సబ్ కలెక్టర్


కలిదిండి- కైకలూరు సమీపంలో కూలిపోతున్న లాల్వ డ్రెయిన్‌పై రహదారి

కుంభవృష్టి

(5వ పేజీ తరువాయి)

ప్రాంతాన్ని సబ్ కలెక్టర్ వినూత్న గురువారం పరిశీలించారు. డ్రెయినేజీలకు అడ్డుపడిన సిల్ట్ తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఉంగుటూరు, భీమడోలు మండలాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్ల పైకి వర్షం నీరు చేరి రోడ్లు చిద్రంగా మారాయి. కలిదిండి మండలం కలిదిండి-కైకలూరు ప్రధాన రహదారిలో లాల్వ డ్రెయిన్‌పై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారి కుంగిపోతుంది. భారీ వర్షాలకు ఎగువ నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో సగానికిపైగా రహదారి కోతకు గురైంది. పోలీసులు ఘటనా స్థలంలో చేరుకుని వాహనాలను నిలుపుదల చేశారు.

అప్రమత్తంగా ఉండాలి : మంత్రి సారథి

భారీవర్షాల కారణంగా ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని, లోతట్టుప్రాంతంలో నివసించే ప్రజలు పట్ల అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఏలూరుజిల్లా మంత్రి కె.పార్థసారథి, అధికారులకు స్పష్టం చేశారు. వరద విపత్తును ఎదుర్కొవడానికి ప్రభుత్వయంత్రాంగం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో ఎటువంటి ప్రాణనష్టం, ఆస్తినష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎంపీ పుట్టా

అల్పపీడనం ప్రభావంతో వచ్చే మూడు రోజులు భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికలు, గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లాకు ఆరెంజ్ అలెర్ట్ జారీ, గత అనుభవాలు నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్ వద్ద కంట్రోలు రూమ్ నంబర్ 1800-233-1077, 94910 41419లకు లేదా ఎంపీ కార్యాలయ నంబర్లు 96181 94377, 98855 19299కు ఫోన్ చేయాలని సూచించారు.


రెడ్డయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రారంభించిన వాహనాలు

ఉచిత వాహన సేవ కార్యక్రమం ప్రారంభం

నూజివీడు టౌన్, ఆగస్టు 28, (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎన్నికల బరిలో నిలబడి తాను ఎమ్మెల్యేగా కాక ప్రజా సేవకునిగా పెద్ద పాలేరులా పనిచేస్తానని చెప్పిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి ప్రజాసేవలో మరో అడుగు ముందుకు వేశారు. వర్షాకాలంలో పలు పనులపై నూజివీడు పట్టణానికి వచ్చి తిరిగి వారిని గమ్య స్థానాలకు చేర్చేందుకు ఉచిత వాహన సేవ కార్యక్రమాన్ని గణపతి నవరాత్రుల సందర్భంగా ఆయన లాంఛనంగా ప్రారంభించారు. నూజివీడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం మంత్రి పార్థసారథి క్యాంప్ కార్యాలయం నుంచి ఈ వాహన సేవ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. వర్షం కురిసినప్పుడు ప్రజలకు అసౌకర్యం కలగకుండా నిరంతరం సంచరించే ఈ వాహనాలు వారిని గమ్య స్థానాలకు చేరుస్తాయని పేర్కొన్నారు.

వ్యవసాయ పరికరాల సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి

ముసునూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యంత్రాలకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు ఉసద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు అన్నారు. రాష్ట్రీయ కృషి వికాస్ పథకం ద్వారా చింతలవల్లి స్కంద ఎంటర్ ప్రైజస్ రైతు గ్రూపునకు 80శాతం సబ్సిడీపై మంజూరైన డ్రోన్‌ను టీడీపీ నాయకులతో కలిసి ఏవో చాముండేశ్వరి రైతులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ డ్రోన్ పూర్తి విలువ రూ.10 లక్షలు కాగా 80 శాతం సబ్సిడీపోగా రైతులు గ్రూప్ తరపున రూ. 2 లక్షలు చెల్లించారని తెలిపారు. డ్రోన్ వల్ల వ్యవసాయంలో వినియోగాలు, లాభాలను ఆమె వివరించారు. యూబీఐ నూజివీడు బ్రాంచి మేనేజర్ రామాంజనేయులు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాటేపల్లి సురేంద్ర, నాయకులు పాలడుగు నాగేంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.

నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా..

వెయిట్ ఎత్తితే పతకమే..

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో దయాసాగర్ ప్రతిభ


వెయిట్ లిఫ్టింగ్ పోటీలో క్రీడాకారుడు దయాసాగర్ (ఇన్‌సెట్‌లో) గోల్డ్‌మెడల్ పొందిన దృశ్యం

ముదినేపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విశ్వనాద్రిపాలెంకు చెందిన రాడ్ బెండర్ పక్కిరి రత్నబాబు - కమల దంపతుల కుమారుడు దయాసాగర్ విద్యార్థి దశ నుంచే వ్యాయామం, క్రీడలపై ఆసక్తి పెంచుకున్నాడు. వెయిట్ లిఫ్టర్‌గా రాణించి జాతీయ స్థాయిలో అనేక అవార్డులు సాధించాడు. ఇంటర్, డిగ్రీ చదువుతున్న సమయంలో వెయిట్ లిఫ్టింగ్ పోటీలను చూసి తాను కూడా వెయిట్ లిఫ్టర్‌గా రాణించాలన్న పట్టుదలతో గుడివాడ, ఏలూరుల్లో కోచింగ్ తీసుకుని అనతి కాలంలోనే పోటీల్లో పాల్గొన్నాడు. 2016లో రాష్ట్ర స్థాయిలో పలు చోట్ల జరిగిన పోటీల్లో 130 నుంచి 150 కేజీల బరువును ఎత్తాడు. 2025 నాటికి 270 నుంచి 280 కేజీల బరువును లేపగలిగే స్థాయికి చేరాడు. నాగపూర్, కొచ్చి, చండీగడ్, కేరళ తదితర ప్రాంతాల్లోని పలు యూనివర్సిటీల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని జాతీయ స్థాయిలో ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించడంతో పాటు పలు పోటీల్లో బంగారు, రజిత పతకాలను సాధిం చడంతో పలువురు కోచ్‌లు జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి దయాసాగర్ పేరును సిఫారసు చేసే స్థాయికి ఎదిగాడు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	112, 121, 132
చికెన్ విత్ స్కిన్	214
చికెన్ స్కిన్‌లెస్	224
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	